

## పెదకథ



# గాలిలో దీపాలు

వలివేటి నాగచంద్రావతి



'ఆడుది అన్నిరంగాల్లోనూ ముందు కొచ్చేస్తోంది' అని ఎన్నో గొంతులు ఒక వైపునించీ ఘోషిస్తోనే ఉన్నాయి.

మరోవైపు నించి మనసు కలచివేసే దారుణాలు స్త్రీపట్ల జరిగిపోతూనే ఉన్నాయి.

ఏది నిజం? ఏది అబద్ధం? ఎవరు వీటికి కారణం? పురుషుడు! ఔను. మగవాడొక్కడే. ఆడదాన్ని అందల మెక్కించాలన్నా అధోగతికి తోసివేయాలన్నా అతడొక్కడే సమర్థుడు.

ప్రాణముండీ, ఆలోచన వుండీ. అతని కుయుక్తులకో, శారీరక బలానికో లొంగిపోయి, అతనెలా ఆడమంటే అలా ఆడి దాసోహమనే మరబొమ్మగా మారిపోతూంది ఆడుది.

యావత్తు మగజాతి మనస్సు విశాలం



చేసుకుంటేనే తప్ప ఈ అన్యాయానికిక అంతం లేదు

* * *

వరలక్ష్మి నా చిన్ననాటి నేస్తం. అలనాటి మా ఆటపాటలన్నీ నాకింకా జ్ఞాపకమే. జనార్థనస్వామి కోవెల్లో పొగడపూలేరుకోవాలన్నా, వేణుగోపాలస్వామి ఆలయంలో పున్నాగపూలు రాల్చుకోవాలన్నా ఇద్దరం జతగా వెళ్లేవాళ్లం.

తమ్మిలేటి మెత్తని, తెల్లని ఇసుకలో పిచికగూళ్ళు కట్టుకునేవాళ్లం; మెట్ల కింద సామాన్లగదిలో బొమ్మలపెళ్లిళ్లు చేసుకునేవాళ్ళం; తను బెల్లం ముక్క తెచ్చినా, నేను మైసూర్‌పాక్ తెచ్చినా సమంగా పంచుకునేవాళ్లం.

జడ్జీగారి మనవరాలినీ, ప్లీడరుగారి గారాబాల కుమార్తెనూ నేను; విస్తరాకులు కుట్టీ అప్పడాలు వత్తీ అవసరమయినవాళ్లకి వంటలక్కపని చేసీ బతుకీడుస్తున్న తాయారమ్మ కూతురు వరలక్ష్మి.

ఈ అంతస్తుల హెచ్చుతగ్గులేవీ మా మైత్రికి అడ్డుగోడలు కాలేదు. ఎవరూ మా స్నేహానికి ఆటంకాలు చెప్పలేదు.

ఒకప్పుడు తాతగారి హయాంలో జడ్జీగారి భార్యామణి హోదా వెళ్లబోసిన బామ్మ మటుకు అప్పుడప్పుడూ ముక్కు విరుచుకుంటూ సణుగుతుండేది.

నాన్నగారు గాంధి తత్వాన్ని జీర్ణించుకున్న మనిషి అవటంచేతనూ, ఇక అమ్మయితే నాన్నగారు ప్రేమించి పెళ్లి చేసుకున్న ఒక పేద గుమాస్తా కూతురు కావటంచేతనూ, వారిద్దరూ ఆవిడ గొణుగుడును అంతగా పట్టించుకునేవారు కాదు.

నేను సరే; నా స్కూలు మిత్రురాళ్ల మోస్తరుగా కాక నా నాయకత్వాన్ని మారాడక మన్నించే వరలక్ష్మి చెలిమిని ఏ పరిస్థితుల్లోనూ ఒదులుకోవాలనుకునే దాన్ని కాదు.

* * *

మా కాలనీ కట్టిన కొత్తల్లో వంపులు ఉండేవి కావు. నూతినీళ్లు చప్పగా వుండి ఎన్ని తాగినా దాహం తీరేది కాదు.

ఏ వూరి నించి వచ్చిందో కానీ, డాక్టరు కామేశ్వరరావుగారి ఇంట్లో పెళ్లి వంటకని వచ్చిన తాయారమ్మ ఇక్కడి నీటి ఎద్దడిని బ్రతుకు తెరువుగా మార్చుకున్నది.

కాలనీకి దాదాపు నాలుగు ఫర్లాంగుల దూరాన శనివారప్పేట మలుపులో వున్న వంపు దగ్గర్నించీ మంచినీళ్లు తెచ్చిపెట్టే షరతుమీద వాడిక ఇళ్లు పదిపన్నెండు కుదుర్చుకుని ఇక్కడే స్థిరపడిపోయింది.

అప్పటికి అయిదేళ్ల పిల్లట వరలక్ష్మి. తడిబట్ట కట్టుకుని మడినీళ్లు చేరబోసే

తల్లితోపాటు, సగం పరుగూ, సగం నడకతో వెంబడిస్తో తిరుగుతుండేది.

మా కాలనీకి పక్కనే పోరంబోకు స్థలాలు ఆక్రమించుకుని చాలామంది పూరిళ్ళు వేసుకుని కాపురాలు ఉంటూండేవారు. వారిలో కూరలమ్ముకునే గవరలు మొదలు పౌరోహిత్యం చేసుకునే బ్రాహ్మల వరకూ నానారకాలవారూ ఉండేవారు.

మొదట్లో ఆ పూరి కొంపల్లోనే కాపురముంటున్న శివాలయం పూజారి సోమావధాన్లుగారి ఇంట్లో వో వసారాగది అద్దెకు తీసుకుని అక్కడే నాలుగ్గింజలు ఉడకేసుకుంటూండేది. తరవాత ఈ పోరంబోకు స్థలాలకు పట్టాలు ఇస్తారన్న గాలివార్త విన్నాక తనూ ఆ పక్కనే వో చిన్న జాగా కూడగట్టుకుంది మెళ్లోవున్న ఒంటిపేట కాశికాయగుళ్ల గొలుసుని, పాలమ్మకొనే పైడమ్మ దగ్గర తాకట్టుపెట్టి రెండువందలు తెచ్చుకుంది.

'తాటాకులూ, ద్వారబందాలూ, నల్లమట్టీ—వీటికే రెండువందల రూపాయలూ చెల్లిపోయాయమ్మా' అని మాకు మంచినీళ్ళు పొయ్యటానికి వచ్చినప్పుడు తాయారమ్మ మా అమ్మతో చెప్పుకుని విచారపడటం నాకు లీలగా జ్ఞాపకమున్నది.

కూలి భరించే స్తోమతులేక మధ్యాహ్నం పూట తిండి తినటానికి వచ్చిన ఏ పనివాణ్ణో, మళ్లీవాడు పనిలోకి వెళ్లేలోగా వో గంట తనపని చేసిపెట్టమని బ్రతిమలాడుకునేది. 'నాయన్నాయన మగదిక్కులేనిదాన్ని; పసిదాని మొహం చూసి ఈ సాయంచేసి పెట్టు నాయనా' అని కాళ్లావేళ్లాపడితే, ఆవిడమాట తీసెయ్యలేక, ఆవిడచేతిలోపెట్టే,పావలాఅర్థాకే సంతృప్తిపడి వచ్చేవాళ్లు ఎవరో ఒకరు.

వాళ్లు మిడతవేస్తుంటే తను మట్టి అందించీ, కప్పువేస్తుంటే ఆకులందించీ, మగపనీ, ఆడపనీ అనే తేడా లేకుండా కష్టపడింది.

చీకటితో బిందె భుజాన పెట్టుకుంటే నీళ్లమోత పూర్తయ్యేసరికి మిట్టమధ్యాహ్నమయ్యేది. వంట చేసుకుని రెండుముద్దలు నోట గొట్టుకునేదో లేదో మళ్లీ ఇంటిపనికి నడుం వంచి, ఆ ఇంటికో ఆకారం వచ్చేదాకా ఆవిడెంతో శ్రమపడింది పాపం.

* * *

వరలక్ష్మికీ నాకూ జట్టు విచిత్రంగా కలిసింది. మా ఇంటికి వో వందగజాల దూరంలోనే వుండేది వాళ్ల ఇల్లు. మా పెరటి తలుపుతీస్తే వాళ్ల ముంగిట్లో జరిగేదంతా స్పష్టంగా కనిపించేది.

మధ్యాహ్నం భోం చేశాక వో కునుకు తియ్యటం మా బామ్మ కలవాటు; సరిగ్గా అప్పుడే ఇల్లెగిరిపొయ్యేలా అల్లరి చెయ్యటం నా కలవాటు. అత్తగారికి నిద్రాభంగం కాకుండా చూడాలిసిన బాధ్యత కోడలిది కదామరి! అమ్మ నా నోరునొక్కే వుపాయం కానక, నాకూ జోకొట్టాలని ప్రయత్నించేది. ఆవిడ బారినుంచి తప్పించుకుని పెరటివైపు జారుకునే దాన్నినేను.

పెరటి గుమ్మం తలుపు తీసుకు కూర్చుంటే తాయారమ్మ వాకిట్లో పచ్చమట్టి అడుసు తొక్కడం, వరలక్ష్మి చిన్న చెంబుతో నీళ్లు తెచ్చి అడుసులో పోస్తూ తల్లికి సాయం చేస్తూండటం, నిలబెట్టిన గోడలకి పచ్చమట్టీ పేడా కలిపి అలకడం, అలికిన గోడలకి సుద్దనానబెట్టి వెల్లవెయ్యటం, చూస్తూండగానే నల్లటి మట్టిగోడలు తెల్లగా వెండల్లే మెరిసిపోవటం మహతమాషాగాఉండి దగ్గరగావెళ్లి చూడాలనే అభిలాషను నాలో కలిగించేవి. నాకు తెలియకుండానే నా కాళ్లటు లాక్కెళ్లేవి.

వరలక్ష్మి నన్ను చూసి చనువుగా నవ్వేది. చెయ్యి పట్టుకుని తీసికెళ్లి వాళ్ల అమ్మా తనూ కలిసి పాతిన జామా, సపోటా, నిమ్మా, కొబ్బరీ మొక్కల్ని వరసాగ్గా చూపించేది. ఇవిగాక కూరగాయల మొక్కలెన్నో పెట్టిందావిడ.

పూజకి కావాలిసిన మందారం, గరుడవర్ధనం తప్ప, మా గార్డెన్‌లో లాగా పేరు కూడా తెలియని క్రోటన్ మొక్కలేవీ వుండేవి కావు వాళ్ల పెరట్లో.

అన్నిటికంటే నన్నాకర్షించినవి ముగ్గులు. పేడతో నున్నగా అలికిన నేలమీద నానేసిన సుద్దతో ఇంచక్కటి ముగ్గులు ఇంటి నిండుగా అందంగా కంటికింపుగా పెట్టేది తాయారమ్మ.

నల్లగా, వో మోస్తరు లావుగా, అనాకారి కాకపోయినా అందంగావుందని మాత్రం చెప్పడానికి వీల్లేని తాయారమ్మ, మోటవేళ్లతో సుందరంగా, సుతారంగా ఒంపులు తిప్పుతూ ముత్యాలు ఒంచుతోందా అన్నట్టు చుక్కల ముగ్గులు పెట్టేస్తోంటే కళ్లార్పకుండా అటే చూడ బుద్ధయ్యేది నాకు.

నాపక్క పక్కనే తిరుగుతో ఆ ముగ్గుల పేర్లూ, వాళ్ళమ్మకు ఇంకా ఏయేం ముగ్గులువచ్చో ఏకరువు పెడుతుండేది వరలక్ష్మి, చేతిలో చాక్లెట్ అయిపోతుందేమోనని, కొద్ది కొద్దిగా చీకే పసిపిల్లాడిలా, నన్ను మరి కొంచెంసేపు వాళ్లింట్లో నిలుపుకోటానికి తెగ ఆరాటపడేది.

ఆ పిల్ల తేటకళ్ళూ, ఆరాధిస్తున్నట్టు నాకేసిచూసే ఆ చూపులూ నాకూ ఇష్టమయ్యాయి.

అలా సన్నసన్నగా ఆరంభమైన మా స్నేహం త్వరలోనే బలపడింది. మధ్యాహ్నంపూటా, సాయంత్రాలూ మా ఆటలకి దొడ్లూ తోటలూ సరిపోయేవి కాదు.

నాలుగయిదేళ్లు గడిచేయి. వరలక్ష్మి ఎలిమెంటరీ స్కూలు చదువుతో ఆపేసింది నేను కాన్వెంటులో చేరాను.

నా స్కూలు డ్రెస్‌కేసీ, ఇంగ్లీషు బుక్స్‌కేసీ, ఆశగా ఆశక్తిగా చూస్తుండేది వరలక్ష్మి.

'వరాన్నికూడా కాన్వెంటులో చేర్చరాదటండీ తాయారమ్మగారూ?' అనేదాన్ని కలిమిలేముల నడుమగల తారతమ్యాలు తెలియక.

'దానికా గీతుంటే నాకడుపు నెందుకు పుడుతుంది తల్లీ...' అని వెలిసిపోయిన నవ్వు నవ్వేదావిడ కూతుర్ని దగ్గరికి తీసుకుంటూ.

పాపం తాయారమ్మ భుక్తి మళ్లీ యిరకాటంలో పడింది. 'ఒకరికి మంచి దయ్యే ఒకపని మరొకరి ప్రాణానికి గొడ్డలిపెట్టుగా తయారవటం లోకధర్మమేమో,'

మునిసిపాలిటీవారి ధర్మమా అని వీధికో పంపు వెలిసింది మాకాలనీలో. ఇళ్లల్లో కూడా పంపులు పెట్టించేసుకున్నారు చాలామంది. తాయారమ్మ నీళ్లవాడికలన్నీ పోయాయి. కూటికే తడుముకుంటున్న ఆస్థితిలో కూతుర్నేం చదివిస్తుందావిడ?

అలాగ వరలక్ష్మి చదువుకి ఆదిలోనే హంసపాదు పడిపోయింది.

అమ్మ సలహామీద పిండిఇస్తే అప్పడాలు వత్తిపెట్టడం, పప్పురుబ్బి వడియాలు పెట్టి పెట్టడం, విస్తరాకులు కుట్టి కొట్టుకు వెయ్యడంవంటి పనులు చేస్తో కొంత ఉపాధి కల్పించుకున్నది. దొడ్లో కాసిన కూరగాయలమ్మి కూడా కొంత సంపాదించేది. వంటకి ఎవరింట్లోనైనా కుదురుతానని చూపించిగానీ దగ్గర ఇళ్ళలో

ఠికీ ఆ అవకాశం లేకపోయింది. దూరపు ఊళ్లకు వెళ్లిరావటం కష్టమని ఆ ఆలోచన మానుకున్నది.

చెదురువాటుగా ఏ చిన్న చిన్న శుభ కార్యాలకో ఆరోజు వంటకు మాత్రం పిలుచుకు వెళ్లేవారు కొందరు. దానాదీనా ఆ రెండు పొట్టలూ నిండటానికి అంత ఇబ్బందిలేక పోయింది.

తాయారమ్మలో ఉన్న సుగుణమేమిటంటే ఎంత కాని కాలమొచ్చినా డీలాపడి ఒకర్ని దేహీ అనేదికాదు. రెక్కల్ని నమ్ముకుని గుంభనగా సంసారాన్ని నెట్టుకొచ్చేది. అందరితోనూ మెత్తగా వ్యవహరించేది. అంచేత ఆవిణ్ణి ఎరుగున్న వారందరికీ ఆవిడంటే గౌరవంగా వుండేది. 'నోరు మంచిదయితే వూరు మంచిదవుతుందన్న' సామెతను సార్ధకం చేసిందావిడ.

నేను పై తరగతులకు వచ్చాక వరలక్ష్మితో నా ఆటలజోరు తగ్గింది. కాని మామధ్యగల స్నేహానుబంధం సడలలేదు. మాఇరువురి ప్రకృతులూ విభిన్నమైనవి. సముద్రపు అలజడి లాంటి నాకూ, సరోవరతీరపు ప్రశాంతతలాటి వరలక్ష్మికీ లంగరు కుదిరి స్నేహం నిలవటం ఆశ్చర్యమే.

కొంతమంది రూపం అతిసామాన్యంగా వుండి చూపులను ఆకట్టుకోదు. పరీక్షగా చూస్తే ముందస్తుగా కనబడని అందాలేవో దర్శన మిస్తుంటాయి. ఆ కోవకు చెందుతుంది వరలక్ష్మి.

వరలక్ష్మి పెద్ద అందగత్తె కాకపోయినా మెరుగ్గావుండే పెద్ద పెద్ద కళ్లూ, సన్నగా ఒత్తుగా పొడుగ్గా పెరిగిన పెద్ద తలకట్టూ, పెట్టని సొమ్ములామెకి.

ముఖ్యంగా వరలక్ష్మిలో నన్నాకర్షించుకున్నది ఆమె సుతిమెత్తని స్వభావం; తల్లి సౌమ్యత పుణికి పుచ్చుకున్నది వరలక్ష్మి. దురుసుగా పరుషంగా ఒక్కమాట విసిరేది కాదు.

ఆ తరువాతది ఆమె గొంతు. సన్నగా, తియ్యగా, భావమొలికే కంఠంతో, అష్టపదులూ, తరంగాలూ, కడుమధురంగా ఆమె పాడుతోంటే, పశు లాలకిస్తున్నట్టూ వెన్నెలలు జాలువారుతున్నట్టూ అనిపించేది.

ఆమె పాటలోని మాధుర్యానికి కట్టుబడిపోయి, సినిమా కొస్తానని, షికారు కొస్తాననీ, నా ఇతర మిత్రురాండ్రకిచ్చిన

# గాలిలో దీపాలు

వాగ్దానాల నెన్నిటినో మరిచేపోయేదాన్ని. ఎన్నో సాయంత్రాలు మాటలు తక్కువా పాటలు ఎక్కువగా గడిచిపోయేవి మాకు.

'ఎంత అదృష్టవంతురాలివి వరలక్ష్మీ మనసుని వశపరచుకోగల కిన్నెర కంఠం నీకు దేవుడిచ్చిన వరం సుమా' అనేదాన్ని పరవశించిపోతూ.

చిన్నగా నవ్వేది వరలక్ష్మి. తాయారమ్మ మాత్రం దీర్ఘంగా నిట్టూరుస్తూ, 'ఏమదృష్టమో తల్లీ ... ఈ వరాలన్నీ లక్ష్మీదేవి కటాక్షం ముందు దిగదుడుపే కదమ్మా' అనేది.

ఆవిడ బాధ నాకు అర్థమయింది. వరలక్ష్మికి పెళ్లి ఈడు వచ్చిందనీ, తన కాళ్ళూ చేతుల్లో సత్తువ ఉండంగానే వో అయ్య చేతుల్లో పెట్టేస్తే తనభారం తీరిపోతుందనీ, ఈమధ్య ఆవిడ నోటంట చాలాసార్లు వింటోనే ఉన్నాను.

నన్నూ, తననీ అంతగా ఆకట్టుకుంటున్న కూతురి కమ్మని కంఠస్వరమూ, లేడి చూపులు చూసే తేటకళ్లూ అందరినీ సమ్మోహపరచలేవని లోకాన్ని బాగా ఆకళింపు చేసుకున్న తాయారమ్మకు తెలుసు. 'కాకిపిల్ల కాకికి మాత్రమే ముద్దు' అనే సత్యం తెలియని మూఢురాలు కాదావిడ. మరి కూతురు పెళ్ళి ఎలా అయ్యేనా అని ఆమె బెంగెట్టుకోడంలో ఆశ్చర్యం లేదు.

'అప్పుడో రూపాయీ, అప్పుడో రూపాయిగా కూడబెట్టి వో డబ్బాలో వేస్తున్నట్టు తాయారమ్మ, అమ్మతో చెబితే, 'అలా చేయవద్దనీ, ఎప్పటికప్పుడు పోస్టాఫీసులో వేసి జాగ్రత్త పెట్టమ'నీ అమ్మ సలహా ఇచ్చింది.

ఒక్కటొక్కటి చొప్పున ఎన్ని గింజలు చేరిస్తే వో గాదె నిండేటట్టు? ఆడపిల్ల పెళ్ళంటే మాటలతో వుందా?

అందచందాలూ, విద్యా బుద్ధులూ ఉన్న కన్నెపిల్లను కట్న కానుకలతో సమర్పించుకుంటేనే తప్ప కాళ్ళు కడిగించుకోటానికి ముందుకు రారు ఈనాటి యువకులు. అలాటి పెళ్ళికొడుకుల ముందు ఏ అర్హతలతో నిలబడగలదు వరలక్ష్మి?

అంద చందాలు అంతంత మాత్రం; చదువా పూజ్యం; ముఖ్యంగా వుండాలిసిన 'విటమిన్ యమ్' బొత్తిగా లేదు. వరలక్ష్మి పెళ్లి ఒక సమస్యే మరి తాయారమ్మకి.

ఏడాదిలో వరలక్ష్మికి రకరకాలయినే సమంధాలొచ్చాయి. శవాలు మోసే బాపతు ఒకటీ, ఆశీర్వచన పనసలు చదివి సంభావనలు వడుక్కుని, బ్రతుకుతున్న రకాలు కొన్నీ, ఫక్తు శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః అని యాయవారం మీదే జీవనం సాగించే రకాలు కొన్నీ...

పెళ్లికొడుకు అనగానే ఏ ఐ. ఏ. యస్. ఆఫీసర్నో...ఏ ఫారిన్ రిటర్న్‌డునో మాత్రమే వూహించగలిగే నాకు గంతకు తగ్గ బొంతలన్నట్టు ఈ మోస్తరు రకాలు గూడా ఉంటాయని అప్పుడే తట్టింది.

వీరికి కట్న కానుకలవసరం లేదు. కొబ్బరి బొండంతో పిల్లనప్పగించి వో నమస్కారం చేస్తే చాలు కళ్ళు కద్దుకుంటారు. కానీ ఈ తాడూ బొంగం లేని సమంధాలు తాయారమ్మకేమీ నచ్చలేదు. 'వాళ్ళు తన కంటే గూడా హీనంగా బతుకుతున్నారు. వారి లేమిని పంచుకోడానికి తప్పితే తనబిడ్డ అక్కడ ఏమి బావుకుంటుందీ?' అని ఆవిడ మథనపడేది.

పెళ్లి కావటమే ప్రధానంగా పెట్టుకుని ఏదో ఒక సమంధం తెమ్మని మనసుని సరిపెట్టుకోలేకా, ఇంతకంటే గొప్ప సమంధాలు ఆశించటం తన స్తోమతుకి తగదేమోనని తటపటాయిస్తూనూ తాయారమ్మ సతమతమవుతూ ఉండేది పాపం.

ఇలా అవునూ కాదూ అని ఎటూ నిర్ణయించుకోలేక సంజాటన పడుతూ ఉండగానే మరికొన్ని నెలలు గడిచిపోయాయి

* * *

నేను బి. యె. మొదటి సంవత్సరం పూర్తిచేశాను. వారం రోజుల జ్వరానికే తనకు స్వర్గారోహణకు టికెట్టొచ్చేసినట్టు తను గాభరా పడిపోయి మమ్మల్ని కంగారు పెట్టేసింది మా బామ్మ.

అది చాలక తన ఆఖరి కోరికంటూ నా పెళ్ళి చేసెయ్యమని పట్టుబట్టి కూర్చుంది.

నా డిగ్రీ చదువుని మధ్యలో ఆపడం ఇష్టంలేదు నాన్నగారికి. కాని బామ్మ మాటల్ని ఉపేక్షించి వూరుకోవటం సాధ్యం కాలేదాయనకు. 'నేనెప్పుడు సటుక్కుమంటానో? నా ఆత్మకు శాంతిలేకుండా చేస్తావ్రటా' అని నిష్ఠూరాలు మొదలెట్టే

నరికి లొంగిపోయారు.

నెల తిరక్కుండానే ఒక డాక్టరుగారితో నా వివాహం స్థిరపడిపోయింది. వరుడి తరపు పెద్దల బేరసారాల ముందు, నాన్న గారి సంస్కరణాభిలాషని, అభ్యుదయ భావాల్నీ పక్కకు నెట్టక తప్పలేదు. పది హేనువేల కట్నమూ, అలక పానుపు మీద స్కూటరూ, ఇంకా ఇతర లాంఛనాలూ ఒప్పుకుని చిన్నబోయిన వదనంతో ఇల్లు చేరిన నాన్నని చూసి బోసి నోటితో ముసి ముసిగా నవ్వుకుంది బామ్మ; జాలిగ చూసింది అమ్మ.




# చిత్రాలకు జీవం పొయ్యండి

## ఆగ్ఫా ఫిల్ములతో ఫొటోలు తియ్యండి

అగ్ఫా-గెవార్ట్

**సజీవమైన స్వయంవ్యక్తమైన నలుపు-తెలుపు**

చిత్రాలలో మీ జీవిత మధుర సన్నివేశాలను చిరస్థాయి చేసుకోండి. భారతదేశంలో విస్తార ప్రజాదరణ పొందిన అగ్ఫా సూపర్ పాన్ 24 డిఐఎన్ (200 ఎఎస్ఎ) రోల్ ఫిల్ముతో మీ కది సాధ్యం. అగ్ఫా నలుపు-తెలుపు ఫిల్ములలో, అగ్ఫా ఐసోపాన్ ఐఎస్‌యు 27 డిఐఎన్ (400 ఎఎస్ఎ). అగ్ఫా ఐసోపాన్ ఐఎఫ్ 17 డిఐఎన్ (40 ఎఎస్ఎ) రోల్ ఫిల్ములు, మరియు 35 మిమీ క్యాసెట్లు కూడ లభిస్తాయి.

**...లేదా, వాటిని వర్ణ చిత్రాలుగా తీర్చిదిద్దండి. అగ్ఫాకలర్ ఫిల్ములతో** సహజాతి సహజమైన సుస్పష్టమైన చిత్రాలు వస్తాయి. అగ్ఫాకలర్ సిఎన్ 17 యూనివర్సల్ (మాస్క్ లేకుండా) మరియు, అగ్ఫాకలర్ సిఎస్ఎస్ (మాస్క్‌తో) నెగటివ్ ఫిల్ములతో ప్రకాశవంతమైన కలర్ ప్రింటులు మరియు ఎన్‌లార్జిమెంటులు తీయవచ్చును.

సునిశితమైన వర్ణ పారదర్శకతం కొరకు అగ్ఫా-కలర్ సిటి 18 (డేలైట్) ఫిల్ము ఉపయుక్తమైనది. రోల్ ఫిల్ములుగాను, 35 మిమీ క్యాసెట్లుగాను లభిస్తుంది. ప్రతి ప్యాక్‌తో, సులభముగా పాటించదగిన సూచనలు ఇవ్వబడును. భారతదేశములో తయారు చేయబడుచున్నవి.




మీకు దగ్గరలో ఉన్న అథరైజ్డ్ అగ్ఫా-గెవార్ట్ డీలరు నడిగి మీకు కావలసిన సమాచారము తెలుసుకోండి.

AGI

సోల్ డిస్ట్రిబ్యూటర్లు:

**ఆగ్ఫా-గెవార్ట్ ఇండియా లిమిటెడ్**

బొంబాయి • క్రొత్త ఢిల్లీ • కలకత్తా • మద్రాసు

® ఫొటోగ్రాఫిక్ వస్తువుల ఉత్పత్తిదారులైన అగ్ఫా-గెవార్ట్ ఆంట్‌వెర్ప్/లెవెర్కుసెన్ యొక్క రిజిస్టర్డ్ ట్రేడ్‌మార్క్.

CMAG-148-203 TEL

'హారి వెర్రి నాగన్నా! ప్రేమ ప్రేమంటూ నువ్వు బొందలో పడ్డావుగానీ, ఎవరి విలువ వారు రాబట్టుకోని తెలివి తక్కువ వాళ్ళుంటార్రటా నీ పిచ్చిగానీ...' అన్న అర్థం స్పష్టంగా కనిపించింది బామ్మ నవ్వులో.

'అందరూ మీవంటి విశాలహృదయులే ననుకున్నారా ? ఎంత అమాయకులండీ' అనే సానుభూతి కురిసింది అమ్మ చూపులో.

పెళ్ళి అయిన మూడవనెలలో అత్తవారింటికి ప్రయాణమయ్యాను. బయలుదేరే ముందు చెప్పిపోదామని తాయారమ్మ ఇంటికి వెళ్ళాను.

ఎప్పుడూ హైహీల్సు వదలని పాదాలకి వచ్చగా పసుపూ, బాల్యాన్ని గడిచిన గుర్తుగా లంగా వోణి వదిలి, తప్పనిసరిగా కట్టుకున్న పట్టుచీరా, రెండుజడలకు బదులుగా నిండుగా పూలు ముడిచిన జడా పెద్దాపేరక్కలా తయారయిన నన్ను అతి ఆప్యాయంగా చూసింది తాయారమ్మ.

కన్నీళ్ళతోనే తడుపుతూన్న ఆవిడ చూపుల్లో ఒకవిధమైన తృష్ణా, ఆవేదనా తొంగిచూసి మాయమయినాయి. నాకు తెలుసు ... వరలక్ష్మిని ఈ రూపంలో చూసుకోవాలనే ఆత్రుతా, ఆకాంక్ష ఆవిడ వదనంలో పసిగట్టిన నేను ఆవిడ కోరిక త్వరలోనే తీరాలని మనసారా కోరుకున్నాను.

రవికలగుడ్డతో పసుపుకుంకం పెట్టి, త్వరలోనే ఫామిలీ ప్లానింగువాళ్ళ ప్రయత్నం భగ్నం చెయ్యమని ఆశీర్వదిస్తూ వీడ్కోలు చెప్పిందావిడ. నేను వెడుతూంటే వరలక్ష్మి కళ్ళనిండా నీళ్ళు తొణికిసలాడాయి. బరువుగా అయిపోయింది నా మనసు.

* * *

మళ్ళీ మూడునెలల తరవాత నోముల వంకని శ్రావణమాసంలో వచ్చాను మా వాళ్ళింటికి.

ఒచ్చినరోజునే చల్లని కబురు చెప్పింది అమ్మ. వరలక్ష్మికి సమ్మంధం కుదిరిందట. పదిరోజుల్లో పెళ్ళట.

'పిల్లాడి దేవూరు ? ఏం చదువు కున్నాడు ? ఏంచేస్తున్నాడు ?' అంటూ లక్షారు ప్రశ్నలు వేస్తే, మా బామ్మ తాపీగా, 'ఆపిల్ల చింతతోనే చిక్కి సగమయ్యింది తాయారమ్మ. ఆవిడ మొర భగ తుడు ... ఆలకించాడు పాపం ... మంచి

# గాలిలో దీపం

సంబంధమేనటలే...' అంటూ ఏవేవో సొదకింద చెబుతుందే తప్ప ఎంతకీ అసలు సంగతి వూడిపడనివ్వలేదు బామ్మ.

ఆ విశేషాలన్నీ తెలుసుకోవాలనే వుత్సుకం నన్ను తొందరపెడుతున్నా మధ్యాహ్నం పూట వెడితే పెళ్ళి పనుల్లో మునిగి వుంటారేమోననీ, సాయంత్రమయితే స్థిమితంగా కూర్చుని సవిస్తరంగా తెలుసుకో వచ్చనే ఆలోచనతో నా ఆత్రుతని అప్పటికి అణచుకున్నాను.

ఆ సాయంకాలం నేను వెళ్ళేసరికి ఎండిన ఒడియాలు గుడ్డనుండి ఒలుస్తున్నారు తల్లీకూతుళ్ళు. నన్ను చూసి తాయారమ్మ మొహం చాటంతయింది. వరలక్ష్మి తేట కళ్ళు నందివర్ధనం పువ్వుల్లా విప్పారయి.

'మంచి సమయానికి వచ్చావు సుజాతా! ఆత్మీయుల్ని భగవంతుడు పిలవకుండానే పంపుతాడు సుమా! చుట్టపక్కాలు లేని కొరత నిన్ను చూశాక తీరిందమ్మా...మా హితం కోరేదానివి నువ్వేమాకు ఆత్మబంధవ్వి. వరలక్ష్మిని నువ్వే పెళ్ళికూతురిని చెయ్యాలి' అన్నది తాయారమ్మ ఎంతో అభిమానంగా.

'ఇంతకూ మా గానకోకిలను సొంతం చేసుకోబోతున్న ఆ అదృష్టవంతు డెవరో చెప్పరేం ?' అన్నాను నేను నవ్వుతూ.

సన్నజాజులు మాల కడుతోన్న వరలక్ష్మి కంటిరెప్పలు సిగ్గుగా కిందికి వాలాయి.

పిల్లవాడిది విజయవాడ దగ్గర ఏదో పల్లెటూరట ఆర్ట్సు చదువుకున్నవాడు కాదు గానీ, లెక్కా డొక్కా చూసుకోగల తెలివితేటలూ, వ్యవహార జ్ఞానమూ కలవాడే నట. ముఖ్యంగా బోలెడు ఆస్తి పాస్తులు ఉన్నవాడని చెప్పింది తాయారమ్మ.

పది ఎకరాల మాగాణీ, పదిహేనెకరాల మెరకా, తమలపాకు తోటలూ, పెద్ద లోగిలి ...ఇన్ని ఉన్న పెద్దమనిషి వరకట్నం మేపాటి కోరివుంటాడా అన్న నా సందేహానికి జవాబు కాని జవాబు చెప్పింది తాయారమ్మ వన్నగా, 'రెండో పెళ్ళివాడు తల్లీ' అంటూ.

ఉలిక్కి పడ్డాను నేను. గుండె లోతుల్లో కళుక్కు మన్నట్టయింది.

మొట్టమొదటిసారిగా వరలక్ష్మిని చూసు కుందుకు వచ్చిన వరుడు విభూతిపిండికట్ల సోమయాజులుగారు నా జ్ఞాపకాల పొరల్లో మెదిలారు.

ప్రథమ, ద్వితీయ కళత్రాలను నష్టపోయి ముచ్చటగా మూడోసారి వివాహ వేదికను అలంకరించేటందుకు ఉత్సాహపడుతోన్న ఆయనకు దాదాపూ ఏభై ఏళ్ళకు తక్కువుండవు.

తోమిన రాగి చెంబు బోర్లించినట్టుగా మెరిసే గుండూ, వెనకాల గోష్పాదమంత మేర వెండి జరీ లాంటి జుట్టూ, చొక్కా వేసుకోనందున బాహాటంగా కనబడుతోన్న పెద్ద ఆనబకాయంత బొజ్జా, లావుపాటి యజ్ఞోపవీతమూ, నీర్కావి ఎక్కిన పంచా ఉత్తరీయమూ...ఇదీ ఆయన అవతారం.

## మహానగరంలో నీరెండ

అప్పుడే మేలుకున్న ఆకాశం పసిపాప
అమాయికంగా చిందించిన బోసినవ్వులాగ,
ప్రతి ప్రాణిని ఆప్యాయంగా పలకరించి,
ప్రతి అణువుతోను ఆత్మీయంగా మేళవించి,
ఆదరానురాగాలతో అల్ల నల్లన
కల కల నవ్వింది వేళ,
తొలి సంజెనీరెండ !

బాటలలో తరువులకొమ్మల రెమ్మల మీద,
ప్రతి చిగురాకుమీద, ప్రతి చిన్నారి పువ్వు
మీద,
తోటలలో పసిరి పచ్చని పచ్చికల మీద,
బంతిచేమంతుల మీద, మహోల్లాసంతో
పరవశించి, మైమరిచి,
పరుగులు పెట్టింది నీరెండ !
ప్రశాంతంగా విస్తరించింది
లేత లేత నీరెండ!

మట్టి గుడిసెల మీద, పెద్ద పెద్ద
కట్టడాల కిటికీల మీద,
మురికి పేటలలో
అట్టడుగు మాలిన్యం మీద,
మహానగరంలో అంతట
పసిమితో, మిసిమితో పరవళ్ళుతొక్కి,
ఆనందలాస్యాలతో నేల నాలుగు వైపుల
అపూర్వ మహేంద్రజాలమై,
అందాలు చిందించింది నీరెండ !

అవనిశీర్షంమీద మహాహ్లాద మంగళాక్షతలే
అభివర్షించిందీనాడు,
బంగారు జలతారు తళ తళలతో
మహానగరంలో నీరెండ !

—పి. గణపతిశాస్త్రి.

ఎన్ని సమంధాలు చూసిన అనుభవమో మరి ... మధ్యవర్తి సాయమన్నా లేకుండా తనంతట తానే స్వయంగా విచ్చేశాడాయన.

ఇక ఆయనగారి చాకచక్యమైన సంభాషణా సరళి వినదగ్గది.

తాను నిరతాగ్నిహోత్రుడ్నని, తన తాత తండ్రులందరూ వేదాలు చదివి, యాగాలు చేసి సోమయాజులుగా కీర్తిని గడించిన వారేననీ, త్వరలోనే తాను గూడా ఒక యజ్ఞం చేసి పెద్దల త్రోవను అనుసరించాలనే సంకల్పం ఉన్నదనీ తెలియచేశాడు.

తాను చెయ్యబోయే యజ్ఞానికి సోమిదమ్మ అవసరం తప్పనిసరయి ఇలా కన్యాదానం పట్టడానికి సిద్ధమవుతున్నాడట.

ముసలి ముప్పున తను ఈ వివాహానికి ఒడబడినందుక్కారణం, మరొకరు వేలెత్తి చూపేందుకు ఆస్కారం లేకుండా బహు చమత్కారంగా సమర్థించుకున్నా డాయన.

ఈ యజ్ఞ ఫలంతో తనకు స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయనీ, తనకిక పునర్జన్మ వుండబోదనీ సగర్వంగా చెప్పకున్నా డాయన.

తన స్వార్థంకోసం ఏ కసుగాయ గొంతు తెగ్గొయ్యటానికి వెనకాడని ఘాతుకానికి ఆయన కెలాగూ పుట్టగతులుండవనీ, వేరే యజ్ఞయాగాలు చెయ్యనక్కరలేదనీ చెప్పాలనిపించింది తనకు.

ఓ పక్క కీచకుళ్ళా వరలక్ష్మి వంక ఆకలి చూపులు చూస్తూనే, మరొక పక్క శ్రీరంగ నీతులూ, కల్లబొల్లి కబుర్లూ చెబుతున్న ఆయన నీచత్వానికి అసహ్యమేసింది.

ఆయన ఎదురుగా బలిపీఠం మీద మేక పిల్లలా బెదిరిపోతూ చాప మీద ముడుచుకు కూర్చుంది వరలక్ష్మి. ఆ మహానుభావు డటు గుమ్మం దిగీ దిగ్గానే మోకాళ్ళలో మొహం దూర్చేసి బోరుమన్నది. నాకూ కళ్ళు చెమ్మగిల్లాయి. 'ఆడ పుట్టుక కంటే, అడివిలో మాను పుట్టుక మంచిద'న్న సామెత యథార్థమనిపించిందా సమయంలో

కూతుర్ని ఎలని గుండెకి ఆనించుకుంటూ, 'నీకు పెళ్ళి చేయకలేకపోతే పీక పిసికిపాడు నూతిలో తోస్తాను గానీ, ఇటువంటి వాడిచేతిలో పెట్టనమ్మా' అని ఉగ్గ్రత్తికతో అనడం తనకు బాగా జ్ఞాపకం.

మరి ఇప్పుడే విపరీతమేమిటీ?

'రెండో పెళ్ళన్న మాటేగానే వయ



దీర్ఘ రోగులకు
ఉత్తమ వైద్యము
నపుంసకత్వము, శుక్లనష్టము, హస్తప్రయోగము, అసంతృప్తి, ఉబ్బసము (దమ్మ), బోధకాళ్ళు, చెవుడు, కడుపునొప్పి, కుష్టు, బొల్లి, చర్మ వ్యాధులకు పోస్టలు ద్వారా కూడా వైద్యము చేయబడును.
శివాలాజ వైద్యశాల, డా పి. కుమారస్వామి దేవర, ఎ. బి. రోడ్, తెనాలి. ఫోన్: 551.
బ్రాంచి: 9—డి, శివాజి స్ట్రీట్, మద్రాసు—17

వాయిదాల పద్ధతిపై ట్రాన్సిస్టరు

బిన్నీ మానర్
3 బ్యాండ్ ఆల్‌వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ (గ్యారంటీతో) నెలకు రు. 10 వంతున చెల్లించి పొందండి. ఇండియాలో అన్ని గ్రామములకు, పట్టణములకు, పంపగలము. అసలు ధర రు. 165/—
VISHAL AGENCIES
P B. 2100, (APW) Delhi-7.

ఏజెంటుకావలెను


ఒవామ అర్జు చీరలు, టెర్లిన్ సూటింగులు రెడీమేడ్ దుస్తులు, నైలాన్ సాక్సు, టైలు, స్టైన్లెస్ స్టీలు పాత్రలు వగైరాలకు ఆర్డర్లు బుక్ చేసి నెలకు రు. 650—గాని మంచి కమిషన్ గాని ఆర్జించండి. ఉచిత షరతులకు, పూర్తి పైజ శాంపిల్సుకు వ్రాయండి.
NEW DELHI AGENCIES
Hari Nagar Ashram. New Delhi 14

35సం॥ అనుభవం
వరిబీజము బుడ్డలు బీజకుట్టు మొదలగు వ్యాధులకు ఆపరేషన్ లేకుండా గ్యారంటిగా బాగుచేయబడును
వివరములకు:
రే అండ్ కో ఆసుపత్రి
గౌలిగూడ సిటీ బస్ డిపో ఎదురు,
రామ్ మందిర్ రోడ్, హైదరాబాద్-12 ఆ.ప్ర
ఆఫీస్ ఫోన్: 42870 ఇంటి ఫోన్: 38544


పెప్స్ సురక్షితమైన మూలికా నివారిణి
దగ్గు మరియు గొంతునొప్పులకు
బాగా పనిచేసే. రుచిగల బిళ్ళలు పెప్స్
పెప్స్ లొజెంజి లాగా చప్పరించండి. మూలికల సారం మరియు ఆంటిసెప్టిక్ పదార్థాలు గొంతులోని ఊపిరితిత్తులలోని సున్నిత భాగాలలోనికి చొచ్చుకొని పోతాయి. దాని ఏకైకమైన 'తెరవపరచు' చర్య వలన దగ్గు గొంతునొప్పి త్వరగా తగ్గుతాయి.
బాగా పనిచేసే, రుచిగల బిళ్ళలు పెప్స్ దగ్గర ఉంచండి


పెప్స్ 50 సంవత్సరాలు పైగా విశ్వసనీయమైన దగ్గు నివారిణి

# గాలిలో దీపాలు

స్నేహంతో లేదమ్మా ... వరానికి ఈడూ జోడూగానే ఉన్నాడు. రూపురేఖలు గూడా చక్కనివి.' తాయారమ్మ ఎంత నచ్చచెప్పి చూస్తున్నా సంతృప్తిపడలేక అంగీకారం కోసం వరలక్ష్మివైపు చూశాను.

వరలక్ష్మి మెత్తగా నవ్వింది. అంత మృదువుగా నవ్వగలగడం వరలక్ష్మికే చేతనవుతుంది.

ఆ మందహాస మొక్కటిచాలు ఆమె సంపూర్ణంగా ఇష్టపడిందనటానికి నిదర్శనం.

సోమావధాన్లు గారిని బ్రతిమలాడి ఆ పిల్లవాడి గ్రామానికి పంపించావనీ, వాళ్ళస్థితి గతులన్నీ విచారించి వాళ్ళు చెప్పిన ఆస్తి వివరాలన్నీ వాస్తవమని తేల్చుకున్నాకే తాంబూలాలు పుచ్చుకున్నామనీ, పిల్లవాడి తల్లినీ, ముందుభార్యనీ నగకట్టంతా వరలక్ష్మికే పెడతామన్నారనీ, పెళ్లిఖర్చులు గూడా తామే భరిస్తామన్నారనీ, ఇంకా ఏవేవో చాలాచాలా సంగతులు నేను లేచే వరకూ చెబుతూనే వుంది తాయారమ్మ.

సందెదీపం వెలిగించి బొట్టుపెట్టింది వరలక్ష్మి. నేను వచ్చేస్తుంటే, 'మళ్లీ వారంనాటికి పెళ్లికూతుర్ని చేసే' ఆ మర్నాడు అన్నవరం కొండమీద పెళ్లి చెయ్యాలని వరుడితరఫు వారు నిర్ణయించినట్టు చెప్పింది తాయారమ్మ.

ఈవారం రోజులూ నేను మళ్లీ వాళ్లింటికి వెళ్లటం పడనేలేదు. ఏవో పూజలూ పునస్కారాలూ, నోములూ వ్రతాలూ అంటో, అమ్మా బామ్మా నన్ను వూపిరి తీసుకోనివ్వకుండా రొప్పు పెట్టేసారు.

పూజారి సోమావధాన్లుగారి భార్య వరలక్ష్మిని పెళ్లికూతుర్ని చేస్తున్నామంటూ పేరంటానికి పిలువ వొచ్చేవరకూ నేను, 'నువ్వే పెళ్లికూతుర్ని చెయ్యాలి సుమా' అన్న తాయారమ్మగారి అభ్యర్థన మాటే మరిచిపోయాను. నామతి మరుపుకి ఎంతగానో నొచ్చుకుని బాధపడ్డాను.

మర్నాడు, 'ఇదెక్కడి చుట్టరికమమ్మా' అని బామ్మ గొణుక్కుంటున్నా లక్ష్యపెట్టకుండా, వో పట్టు చీరా, పళ్లూ పూలూ తెప్పించి వరలక్ష్మికి పట్టుకెళ్లాను.

ఇంటిముందు నాలుగు రాటలు పాతి, కొబ్బరాకులతో వేసిన చిన్నపందిరీ, రాటలకి కట్టిన అరిటిచెట్లు, గుమ్మాలకి మామిడాకు తోరణాలూ, గడపలకి పసుపు కుంకుమలూ, అటూ ఇటూ తిరుగాడే ఇరుగుపొరుగు నలుగురు ముత్తయిదువులతో తాయారమ్మ ఇల్లు కల కళ్లాడుతోంది.

తాయారమ్మ చెప్పినట్టే ఆమెబంధువు లెవరూ రాలేదు. అసలు దగ్గర బంధువులు అని చెప్పుకోదగ్గ వాళ్లు ఆమెకేనాడో గతించి పోయారట. ఎక్కడో బీరకాయపీచు దూరపుచుట్టాలకు నీళ్లుమోసేఈవిడంటే నిరసనా నిర్లక్ష్యమూనట. అంచేత వాళ్లు రాకపోవటాన్నిగురించి అంతగా పట్టించుకోలేదు తాయారమ్మ.

కల్యాణం బొట్టూ బుగ్గనచుక్కా వరలక్ష్మికి పెళ్లికళ తెచ్చాయి. పసుపు కొట్టి హారతిచ్చాక, కాళ్లకు నమస్కరిస్తున్న కూతురితలపై అక్షింతలుంచుతూ కళ్లొత్తుకున్నది తాయారమ్మ.

ఇన్నాళ్లకు తన వాంఛితం నెరవేరుతోన్న సంతృప్తికి చిహ్నాలే ఆ ఆనందాశ్రువులు.

నన్ను పెళ్లికి అన్నవరం రమ్మని తాయారమ్మ మరీ మరీ ప్రాధేయ పడింది.

కాని బామ్మకు జడిసి అమ్మ నన్ను వెళ్ళనియ్యలేదు. సోమావధాన్లుగారి కుటుంబం మాత్రం వెళ్లారట. బహుశా రెండవ పెళ్ళి అయినందువల్లనేమో, మగపెళ్ళి వారుకూడా నలుగురైదుగురు మాత్రమే వచ్చారని తరవాత తెలిసింది.

అన్నవరం దేవుని సన్నిధిలో వివాహమైన అనంతరం అట్నించి అటే వరలక్ష్మిని మూడు నిద్రలకు అత్తవారింటికి తీసుకువెళ్ళారు. మళ్ళీ వాళ్ళు మనుగుడుపులకు వచ్చినప్పుడు చూశాను వరలక్ష్మి పెనిమిటి కేశవరావుని. మనిషి ఎర్రగా ఎత్తుగా చూపులకు బాగానే వున్నాడు. వ్యవసాయప్పనులలో మెలిగేవాడవటంవల్ల కాబోలు వయసుకు మించిన మోటుతనం కనబడుతోంది. కొంచెం చురుకుపాలు తక్కువగా మందకొడిగా కనిపించాడు. అప్పుడే నిద్రలేచిన బద్ధకస్తుడిలా ఉన్నాడు.

వరలక్ష్మి కూడా వంటినిండా ఇన్ని నగలు దిగేసుకుని, నేత జరీ చీర కట్టుకుని వెనకటి నాజూకుతనం కోల్పోయింది. ఏదిఏమైనా అనుకోని అంతస్తులు అందుకున్న వరలక్ష్మి చాలా అదృష్టవంతురాలనిపించి సంతోషపడ్డాను.

పెళ్లికొడుకు వెంట అతని మేనమామ వచ్చాడు. ఆయన పేరు నాగభూషణమట. ఆయన గురించి తాయారమ్మ చాలా ఘనంగా చెప్పింది.

వరలక్ష్మి పెనిమిటికి చిన్నప్పుడే తల్లీ తండ్రీ పోతే, అంత ఆస్తిని దాయాదుల పాలుగాకుండా కాపాడి నిలబెట్టింది ఈ పుణ్యాత్ముడేనట. అప్పగారి కుటుంబం కోసం ఆయన త్యాగం ఎంత దూరం పోయిందంటే, కోర్టుల చుట్టూ తిరగటం, పిల్లవాడి సంరక్షణ చూడటం, ఈ జంజాటంలోపడి ఆయన పెళ్ళి కూడా మానుకున్నాడట. వ్యవహారాలన్నీ కుదుటపడి పిల్లవాడు కాస్త ఎదిగేసరికి ఆయన వయసు మళ్ళిపోయింది. ఇక ఇప్పుడి మేనల్లుడే తన కొడుకనుకుంటూ,అతని మంచీ సెబ్బరా, పెళ్ళీ పేరంటమూ చూస్తూ ఇతనితోనే ఉండిపోయాడట.

ఆయన చరిత్ర విన్నప్పుడు కలిగిన సద్భావం, ఆయన్ని చూసినప్పుడు కలగలేదు నాకు. కోపదారీ, కఠినుడూ, మొండివాడూ అనిపించింది చూడగానే. ఆయన పెద్దరికంలో సాత్వికురాలయిన వరలక్ష్మి సుఖపడగలదా అని సందేహపడ్డాను.

నా మనసులోని ఈ భావాన్ని ఉండబట్టలేక అమ్మ ముందు వెలిబుచ్చాను.

'నీ మొహం! ముఖ కవళికలు కఠినంగా ఉన్నంత మాత్రాన మనసు మెత్తనిది కాదని అంచనా వెయ్యకూడదు. పైకి గంగిగోవుల్లా వుంటూ గొంతులు కోసేవాళ్ళు లేరూ ?' అన్నది.

'ఒకరిని చూస్తే పెట్టబుద్ధీ ఒకరిని చూస్తే మొట్టబుద్ధీ అవుతుందంటారు ఇందుకనే కాబోలు. లేకుంటే భీష్ముడంతటివాడని విని కూడా నాకా చెడ్డ వూహ తెందుక్కలగాలి ?'

వరలక్ష్మిని నెల లోపలే కాపురానికి తీసుకువెళ్ళారు. పెళ్ళి ఖర్చు అంతగా అవలేదు కాబట్టి పెళ్ళికని దాచిన సొమ్ముతో నాలుగు చీరలూ, దుప్పట్లూ, తువ్వాళ్లూ అంటూ తనకు తోచిన వస్తువులేవో కొని కూతురికి ఉన్నంతలోనే సారెపెట్టి పంపింది తాయారమ్మ.

శ్రావణమాసం వెళ్ళటంవల్ల నేనూ ఆ తరవాత ఎక్కువరోజులు వుండలేదు.

**(ఇంకా ఉంది)**

## పెదకథ

# గాలిలో దీపాలు

**వలివేటి నాగచంద్రావతి**

(గత సంచిక తరువాయి)

★ పాలు (పనాహంలో రెండేళ్ళు కలిసిపోయి నాయి.

ఈ మధ్యలో నేను మళ్ళీ పుట్టింటికి రావడం పడలేదు. కొత్త సంసారం దిద్దుకొనే మెళుకువలు నేర్చుకుంటూ, కొత్త బాధ్య తలకు అలవాటు పడుతో, ఉక్కిరి బిక్కిరవు తోన్న నాకు వరలక్ష్మి చెలిమి నా జ్ఞాపకాల అడుగుపొరల్లో పడిపోయింది.

రేడియోలో ఏ రమ్మని కంఠమో, 'సావిరహే...' అంటూ రాధాపిలుపొస్తే, 'వందన చేస్తి త పిలికతేబర...' అంటూ గోపీకృష్ణుని మోహనరూప వర్ణన నో అలపిస్తే తప్ప వరలక్ష్మి నా తలపులలోకి రావటంలేదు.

అప్పుడు మటుకు, 'ఎలా వుందో వర లక్ష్మి? బహుశా ఆష్టపదులు మానేసి, లాలిపాటలు పాడుతూండవచ్చు. కలవారి కోడలయింది కాబట్టి తల్లిని కూడా తన ఇంటికే రప్పించుకుని వుండవచ్చు' అని ఏవేవో వూహిస్తూ వుండేదాన్ని.

నాన్నగారు నన్ను పంపమని ఉత్తరాల మీద ఉత్తరాలు గుప్పించిన మీదట, దయ దలిచి, ఒక్కనెల మాత్రం ఉండే ఎగ్రి మెంటుతో నన్ను రైలెక్కించారు మావారు.

స్టేషన్లో నన్ను చూస్తూనే కళ్ళనీళ్ళ పెట్టేసుకుంది అమ్మ. బామ్మ మరీ అన్యాయం! అంత జనంలోనూ నన్ను కావి లేసుకుని ఉక్కిరిబిక్కిరి చేసేసింది.

'అబ్బే ఈ పెద్దవాళ్ళకి ప్రేమ(ప్రేమ)న్ని మానాలు వెళ్ళబోసుకొనే ఆరాటమేగాని, మేన[illegible] బొత్తిగా తెలియవుకదా.'

[illegible] రోజులు ఏకధాటీగా రాత్రీపగలూ, [illegible] మం [illegible] కుండా చెప్పుకుంటే [illegible] తరగలేదు. అమ్మ ఒది [illegible] బామ్మ మరిచిపోయినవి అమ్మా ఒకరు విడిచి ఒకరు జంటకవుల్లా ఒంతులు వేసుకుని చెబుతూనే వుండేవారు.

ఆ కబుర్లలో బంధువులేనా, స్నేహితు లేనా, పరిచయస్తులేనా, చుట్టుపక్కల వాళ్ళేనా ఎందరెందరి సమాచారాలో దొర్లి పోయాయి. ఒక్కనాటి యోగక్షేమాలా మరి ... రెండేళ్ల విశేషాలాయెను; ఎన్ని చెప్పుకున్నా ఏవో మిగిలిపోతూనే ఉన్నాయి.

ఉన్నంట్టుండి గుర్తుకొచ్చింది తాయా రమ్మ. చిత్రం! ఇన్ని సంగతులు మాట్లాడుకున్నాముగానీ తాయారమ్మ ప్రసక్తే రాలేదు.

తాయారమ్మ పేరెత్తేసరికి బామ్మ అయిష్టంగా మొహం పెట్టేసి లేచి వెళ్ళి పోయింది. అమ్మ ముక్తసరిగా, 'తాయా రమ్మకేం బాగానేవుంది.' అనేసి ప్రసంగాన్ని మరో విషయంమీదికి మళ్ళించేసింది.

అమ్మమాట తప్పించడం గమనించని నేను, 'వరలక్ష్మికి పిల్లలా అమ్మా! ఎప్పుడయినా ఒస్తోంటుందా?' అనడిగాను ఆసక్తిగా.

'పిల్లాలేదూ—పీచుకాలేదు. వరలక్ష్మి ఇక్కడే వుంటోంది పాపం...' అమ్మ కంఠంలో సానుభూతి కురిసింది.

వక్కచూర డబ్బాతో తిరిగొచ్చిన బామ్మ అందుకుని, 'పాపమేమిటే పాపం... చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా అనీ...ఒళ్ళు కొవ్వెక్కి కొట్టుకున్నందుకు అనుభవించక తప్పుతుందా...' అంటూ దీర్ఘం తీసింది.

'మీ రెన్నయినా చెప్పండి. అపిల్ల కలాంటి వంకర బుద్ధులు వున్నాయంటే నమ్మను నేను ఆ అమ్మాయి తలెత్తి గట్టిగా మాటాడ్డం ఎరగను నేను,' అమ్మ దృఢంగా అన్నది.

'అలాగనకు—బుద్ధావతారాల్లా కనిపించే వాళ్ళే కొంపలు కూల్చేస్తారు. మీ మావగారి హయాంలో ఖూనీకోరు నొకణ్ణి చూశా న్నేను. కాషాయవస్త్రాలు కట్టి జపమాల తిప్పుతున్నాడు. ఇదేవిటండీ అంటే పెళ్ళాన్ని పీకపిసికి చంపేశాట్ట ... ఒట్టి రుద్రాక్ష పిల్లివాటం అవటా'ని చెప్పారు మీ మావగారు. అలాగే... ఉంటా రమ్మా మేకవన్నె పులులు.' తన వాదన నెగ్గించుకోడానికి ఉదాహరణ సహితం ఎత్తి చెప్పింది బామ్మ.

వాళ్ళిద్దరి సంభాషణా నాకేమాత్రమూ అవగాహన కాలేదు.

'బామ్మ ఎప్పుడూ ఇంతే; ఆకుకి అంద కుండా, పోకకు పొందకుండా, అసలు సంగతి తేలకుండా, గంటలగ్గంటలు మాటలు పెంచేసి ఎదుటివాళ్ళని సస్పెన్సులో పడెయ్యటం బామ్మ కలవాటే. సహవాస దోషంవల్ల కాబోలు అమ్మకి గూడా ఆ చాదస్తం కొంచెం అంటింది' అనుకున్నాను.

కాకపోతే నేను వరలక్ష్మి సంగతి అడగట మేమిటి...ముద్దాయివైపు ప్లీడర్లా అమ్మా ప్రాసిక్యూషన్ లాయర్లా బామ్మా ఈ వాదులాటేమిటీ?

'ఇంతకీ మీరు మాట్లాడేది ఏమిటి? వరలక్ష్మి కేమయిందీ?' అన్నాను. వూరు కుంటే వాళ్ల వాగ్వాదం ఇంకెంతసేపు సాగుతుందోనని భయపడుతో.

'ఏమవుతుందీ...? కనకపు సింహాసన మునా ... అని అర్హత లేనివారిని అందల మెక్కిస్తే ఇంకేమవుతుంది? ఇదిగో ఇలాగే పెడతోవలుపట్టి మళ్ళీ నడివీధికే వస్తారు.'

బామ్మ ధోరణికి నా సహనం చచ్చి పోతున్నా, కుతూహలం అణచుకోలేక, నువ్వన్నా కరుణించమన్నట్టు అమ్మవంక చూశాను.

అమ్మ ఒక్కక్షణం వెనకా ముందాడి నింపాదిగా, 'వరలక్ష్మిని పెనిమిటి వదిలేశా డట. ఏడాదినించీ తల్లిదగ్గరే వుంటుంది' అన్నది.

'ఆ ... ఎందుకూ ?' అన్నాను నేను చకితురాలినవుతూ

'ఎందుకేమిటే? తిరుగుబోతుని ఎవడేలు కుంటాడేం? మగాడన్నవాడు దేన్నయినా సహిస్తాడుగానీ పెళ్ళాం నీతిమాలినదన్న అపకీర్తిని భరించగలడా? వాళ్ళింకా మర్యా దస్తులు కాబట్టి గౌరవంగా సాగనంపారు,

మరొకళ్లయితే ఏ చెయ్యో కాలో విరిచి పంపేవాళ్లు' నీతి బాహ్యులమయిన వారికా శిక్ష తగినదే అనీ, వాళ్లని దయదలచటమే పొరబాటనిన్నీ తన అమూల్యాభిప్రాయాన్ని వెల్లడించింది బామ్మ. మా బామ్మ జడ్జిమెంటులో నేరస్తులపట్ల కనికరమనేది మచ్చుకు కూడా కనిపించదు.

లిప్తపాటు నా మెదడు పనిచెయ్యటం మానుకుంది. వరలక్ష్మి తిరుగుబోతా? నీతి మాలినదా? పెద్దతనం వచ్చి బామ్మకు మతి స్థిరం తప్పలేదు కదా?

'నిజమేనా అమ్మా ?' అమ్మని కుదుపుతూ అడిగాను నమ్మలేక.

'అలాగనే అనుకుంటున్నారు ఇక్కడందరూ' నిర్లిప్తంగా అన్నది అమ్మ.

నా భావనలో ఈ 'అందరూ' అనేవాళ్లు సాధారణంగా చేతినిండా పనిలేని పదిమంది అమ్మలక్కలయి వుంటారు. వాళ్లు స్వయంగా స్థాపించిన లోకాభిరామాయణపు హైకోర్టులో ముద్దాయిలుగా ప్రవేశపెట్టబడేవారు బహుదురదృష్టవంతులు.

వీళ్ల అనుమానాలకి ఆధారాలక్కరలేదు; రుజువు సాక్ష్యాల ప్రమేయం లేదు; వీరికున్న హక్కులు అపారం; నేరాన్ని మోపేవాళ్ళూ వీరే; దాన్ని స్థిరపరిచేవారూ వీరే; ఆఖరికి శిక్ష విధించేవాళ్ళూ వీరే. వీరి తీర్పుకిక అప్పీలు లేదు. వీరి నోళ్ళల్లో పడినవారికిక విముక్తి లేదు. వారి గతి అధోగతే. ప్రస్తుతం వీరి కోరల్లో మగ్గుతున్న అభాగ్యురాలన్నమాట వరలక్ష్మి.

'అసలు కల్లాకపటం తెలియని అమాయకురాలు. వరలక్ష్మిమీద అభాండాలువేసే అవకాశం ఈ లోకులకెలా చిక్కిందీ?' అన్న నా ప్రశ్నకు సమాధానంగా—

బామ్మని ఏమార్చి, అమ్మని బెల్లించి, అడిగి రాబట్టి గలిగిన సమాచారమిదీ—

వరలక్ష్మి అత్తవారింటికి వెళ్ళి ఏడెనిమిది నెలలు గడిచిన అనంతరం కూతుర్ని దగ్గర నించి రమ్మని ఉత్తరం వచ్చిందంటూ వోనాడు బయలుదేరి వెళ్ళిందట తాయారమ్మ. పదిహేను రోజులు తరవాత వరలక్ష్మిని వెంటబెట్టుకు ఒచ్చేసిందట.



# గాలిలో దీపాలు

ఒచ్చిన మరునాడు సోమావధాన్లుగారితో ఏదో తగవు పడటం, 'మిమ్మల్ని నమ్మినందుకు, నన్నూ నా కూతుర్నీ మోసంచేసి గోతిలోకి తోసారనీ, దాని కాపురం బుగ్గిం పాడయి పోయిందనీ' నిష్ఠూరాలాడుతూ తాయారమ్మ ఏడవటం ఒకరిద్దరు విన్నవాళ్ళు ఉన్నారు గానీ, ఆ వార్త కంటే స్థిరంగా నిలబడిపోయింది మరో కథ. దాన్ని వ్యాపింపచేసిన పుణ్యం సోమావధాన్లగారి భార్యది.

ఆవిడ పనిమాలా అందరిళ్ళకూ వెళ్ళి చాటించిన కథనమేమంటే, 'వరలక్ష్మికి రెండోపెళ్ళి మగడు నచ్చక ఎవరితోనో చాటుమాటు భాగవతం సాగించబోయిందట; భర్త మేనమామ అది కనిపెట్టి మందలించబోతే 'నువ్వా నాకు చెప్పేవాడవని తలాయించిందట; పోనీ తల్లి అయినా బుద్ధులు చెప్పిపోతుందని తాయారమ్మని పిలిపిస్తే, ఆవిడా కూతురు పక్షాన్నే చేరి ఆ పెద్దాయన్ని నానా మాటలూ అని, పెద్ద రగడచేసి కూతుర్ని తీసుకొచ్చేసిందట.'

ఈ ఉదంతాన్ని తన పెనిమిటికి వరలక్ష్మి భర్త మేనమామ నాగభూషణం, పెరికీడు జంక్షన్‌లో కనబడి పూసగుచ్చినట్టు చెప్పాడనీ, 'ఉన్న వూళ్ళో పరువుగల వాళ్ళం అల్లరయి పోయామని' ఆ పెద్దమనిషి తెగవాపోయాడనీ అంటో ఏవేవో చిలవలూ పలవలూ చేర్చి ఆవిడ సాగించిన ప్రచారం ఆనోటా ఆనోటా అల్లుకుపోయి వరలక్ష్మి జీవితం మీద మాసిపోని మచ్చని వేశాయి.

దాని ప్రభావం తాయారమ్మ సంపాదన మీద కూడా గట్టిదెబ్బే కొట్టింది.

తాయారమ్మను అప్పుడప్పుడూ వంటలకూ, పనిపాటలకూ పిలిచి తృణమో, పణమో ముట్టచెప్పే శ్రీమంతులందరూ ఈ పుకార్లు విన్నాక ఆవిణ్ణి పిలవటం చాలా వరకూ తగ్గించారు. ఎవరూ దొరకని పరిస్థితుల్లో మాత్రమే ఆవిడ అవసరపడుతోంది.

మొన్నటి దాకా పెద్ద కులం మనిషని గౌరవంగా చూసి విస్తరాకులు కుట్టించుకునేవారు [illegible] కొట్టుతను, ఇప్పుడు చులకనగా [illegible] కుండా, ఆకు [illegible] ధర, బాగా [illegible] న్నాడు. లేకపోతే తన [illegible] న్నాడు.

ఆఖరికి ఆవిడ దొడ్లో కాచిన కాయగూరలకు సయితం వాళ్ళ అపవిత్రమంటినట్టు ఎవరూ కొనడం లేదు. వెలివేసినట్టే చూస్తున్నారు పాపం వాళ్ళని.

అన్ని విషయాలూ విన్నా అసలు కారణం తెర మరుగునే వుండిపోయిందనిపించింది నాకు.

ప్రతి నేర కారణానికీ రెండు ముఖాలుంటాయని నా నమ్మకం. చెవులకు అదే నిజమని భ్రమ కలిగిస్తూ వినిపించే సాక్ష్యమొకటయితే, దాని వెనగ్గా కష్టపడి కనుగొంటే తప్ప బయల్పడని సత్యమింకొకటి వుంటుంది. అందరిలాగే ఒకపక్కే చూసి, 'నా వంతు దెబ్బ' అన్నట్టు నేనూ ఒక రాయి విసిరి నా దారంట నేను పోదలుచుకోలేదు. లోకాపవాదానికి గురయి అప్రతిష్ఠపాలయిన వరలక్ష్మిని కలుసుకుని ఈ చిక్కుముడి విప్పాలని నిశ్చయించుకున్నాను.

వరలక్ష్మి ఎడల నాకు గల సున్నితమయిన స్నేహభావమూ, ఆ పిల్ల నైతిక ప్రవర్తనపట్ల నాకున్న దృఢమైన విశ్వాసమూ నన్నా పనికి ప్రేరేపించాయి. ఏది తలుచుకున్నా దాని అంతూ తుదీ తేల్చుకోవాలనే నా సహజ మనోవృత్తి అందుకు దోహదం చేసింది.

అమ్మ నెలాగో ఒప్పించి, బామ్మని మభ్యపెట్టి ఓ రోజు తాయారమ్మ ఇంటికి వెళ్ళగలిగాను.

నేను తాయారమ్మ ఇంటికేసి వెళ్ళడం తమ పెరట్లోంచి గమనించింది సోమావధాన్లుగారి భార్య. జరగరాని అకార్యమేదో జరుగుతున్నట్టు కళ్ళు పెద్దవిచేసి నావంక విచిత్రంగా చూసింది. నేనేమీ పట్టించుకోనట్టు ముందుకు నడిచేసరికి ముక్కూమూతీ విరుస్తూ లోపలికి వెళ్ళిపోయింది. ఆవిడ తాయారమ్మ కుటుంబం మీద అంత చేటు కత్తిగట్టడానికి కారణమేమిటో నాకు అంతు పట్టలేదు.

పాదులతోనూ, మొక్కలతోనూ ఎప్పుడూ నిండుగా కలకల్లాడే తాయారమ్మ పెరడంతా ఖాళీగా, బోసిగా వెలతెలాపోతూంది. సరయిన పోషణ లేక ఇంటిమీద కెక్కిన ఆనప్పాదు కుక్కమూతి పిందెలు వేస్తోంది. ఎప్పుడో చెదురువాటుగా విదిపే నీళ్ళతోనే చావలేక బతుకుతూ గుంటపూలు పూస్తోంది గరుడవర్ధనం.

ఇంటికి ఒక పక్కగోడ కూలిపోవడానికి సిద్ధంగా వుంది. పవుడుగారుతోన్న గోడలు తమ దుస్థితిని దీనంగా చాటుతోన్నాయి.

నెమ్మదిగా వీధి తలుపు నెట్టాను. గడియలేని కారణాన తొయ్యంగానే తెరుచుకున్నది. సావిట్లో అడుగు పెడుతూ చుట్టూరా కలయచూశాను.

తలుపు కిర్రుమన్న చప్పుడుకు గోడ కానుకు కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్న వరలక్ష్మి తలెత్తి చూసింది. సంభ్రమంగా లేవబోయి, మళ్ళీ ఏదో నీరసం ఆవరించినట్టు, ఉదాసీనంగా కూర్చుండిపోయింది. ఓ మూలగా ముడుచుకు పడుకున్న తాయారమ్మ యాంత్రికంగా లేచి చాప తెచ్చి వేస్తూ రాని నవ్వు తెచ్చుకుని, 'కూర్చోమ్మా' అన్నది.

అప్పుడే పరిచయమయిన వారి ముందు బిడియపడుతున్నట్టుగా, మొహమాటంగా కూర్చున్నాను. ఎవరి నోటంటా మాటలు పెగిలి రావటంలేదు.

మేకున వేలాడుతున్న పగిలిన అద్దాన్నీ, గూట్లో దుమ్ము కొట్టుకుని, వేణువు విరిగిన కృష్ణ విగ్రహాన్నీ, ఇంటి కప్పునించి వేలాడుతున్న బూజునీ మాస్తో గడిపాను కొంచెంసేపు;

వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దానికి వులిక్కిపడి వరలక్ష్మి వంక చూశాను. రెండు చేతుల్లోనూ మొహం దాచుకుని దుఃఖిస్తోంది వరలక్ష్మి.

నా హృదయం కలిచినట్టయింది.

రెండేళ్ళ స్వల్ప వ్యవధిలో ఎంత మార్పు! కొత్త పెళ్ళికూతురుగా, కలలు పండే కాలం దగ్గరవుతోందన్న తృప్తితో నిండుగా వికసించి వెలిగిపోయిన 'ఆ రూప మెక్కడ! ఆశలు ఆరిపోయి, అపవాదుల పాలయి అలమటిస్తూ ముకుళించుకుపోతున్న ఈ రూప మెక్కడ! ఎంత వైవిధ్యం!

'అందరితోపాటు నువ్వూ మమ్మల్ని వెలివేశావనుకున్నానమ్మా! మా మీద ఈ మాత్రం దయమిగిల్చావు మాకంతే చాలు' అంటోంది తాయారమ్మ గాద్గదికంగా.

'లేదు లేదు తాయారమ్మగారూ! నేనా కట్టుకథల్ని నమ్మలేదు. ఏదీ ... వచ్చిన దగ్గర్నించీ రావాలని అనుకుంటూనే జాప్యం

చేశాను' అన్నాను. ఇంతవరకూ కళ్ళబడ నందుకు సంజాయిషీ వెతుకుతూ.

వరలక్ష్మి ఒళ్ళో పుస్తకం పక్కన పెట్టి, కళ్ళు తుడుచుకుని నా దగ్గరగా వచ్చి కూర్చుంది. నన్నింకా చేరువ చేసు కోవాలన్నట్టుగా నా చేతిని తన చేతిలోకి తీసుకుంటూ, 'నిన్ను మీ పెరట్లో ఈ వారం రోజులబట్టీ చూస్తూనే వున్నాను సుజా...నిన్ను కేకేసి పిలవాలనీ, మునుపటి లాగే చొరవగా నీ దగ్గరకు రావాలనీ ఎంత గానో అనిపించింది నాకు' అన్నది మెల్లగా. ఆమె కంఠంలో ఏదో సుళ్ళు తిరుగు తోన్న బాధా, దాన్ని దింపుకోవాలన్న తపనా వినిపించింది.

'మరెందుకని రాలేదు వరం...?' అడి గానే కానీ నా ప్రశ్న నాకే ఎబ్బెట్టుగా, వెక్కిరింతగా అనిపించింది. ఎందుకు రాలేక పోయిందో నాకు తెలియదూ?

'ఇప్పటి నా పరిస్థితి నీ కర్థం కాదు సుజా! బయట నా మొహం కనబడితే చాలు గజ్జికుక్కమీద రాళ్ళు రువ్వినట్టుగా ఏవేవో చెణుకులు విసురుతున్నారు. ఎవరి మీదనో పెట్టి సూటీపోటీగా మాటలతోనే నన్ను తూట్లు పొడుస్తూ వంకర నవ్వులు నవ్వుతున్నారు. నేను నా ఖర్మానికే ఏడ వాలో, ఈ చిత్రహింస భరించలేకే ఏడ వాలో తెలీటం లేదు' అన్నది భారంగా.

అన్నివైపులనించీ ముంచుకొస్తున్న ప్రళయాన్ని చూస్తూ నిస్సహాయంగా వో అబల చేస్తున్న ఆక్రందన అది. ఏమని ఓదార్చగలను నేను?

కొంతసేపు మౌనంగా వుండిపోయాను.

తాయారమ్మ ఆ నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ నిట్టూర్చింది 'దీని బతుకింత అధ్వాన్నమవుతుందని ఏనాడూ వూహించ లేదమ్మా ... వరం ఇక్కడికొచ్చి ఏడాది దాటిపోయింది నీకు తెలిసే వుంటుంది' అన్నది.

'అవునట...' మొహం తిప్పుకుని ఎటో చూశాను ఇబ్బందిగా.

'మొక్క మొలిచిన మొదట్లోనే తెగులు పట్టినట్టు దీని కాపురం మంట గలిసిపోయిందే అని బాధతోనే మేము కుళ్ళిపోతుంటే పులిమీద పుట్రలా ఈ అపవాదు లొకటి మమ్మల్ని బతికుండ గానే జీవచ్ఛవాల్ని చేసేస్తున్నాయి.' వ్యధ గూడుకట్టుకున్న తాయారమ్మ పలుకులు నాలోనూ బాధను రగిలించాయి.

ఇంటి చుట్టూరావేసిన తాటాకు దడిని పడదోస్తూ గేదె ఒకటి ఇంటిమీది ఆవ ప్పాదుమీదికి ఎగబడుతోంది. దాన్ని తరమ టానికి లేచి వెళ్ళింది తాయారమ్మ. దిగనాసిల్లిపోతున్న ఆ తీగమీద ఆశ చావ లేదు కాబోలు! తల తిప్పి చూశాను; దిగా లుగా తల వంచుక్కూర్చుంది వరలక్ష్మి. దగ్గరసా జరిగి భుజంమీద చెయ్యివేస్తూ, 'ఇంత అనర్థమెలా సంభవించింది వరలక్ష్మి' అన్నాను అనునయంగా.

నేనలా అడగగానే తనని నేనూ అనుమా నిస్తున్నానేమోనని నావంక దైన్యంగా చూసింది వరలక్ష్మి. కానీ ఆ చిహ్నాలు కన బడక పోవటంతో కుదుటపడి, 'నీకు నా పెళ్ళి తరువాత జరిగిన సంగతులేవీ తెలియవు సుజా! ఇంతవరకూ నాకు లేని మకిలిని అంట గట్టిన వారేగానీ నీమాదిరి అసలు విషయం తెలుసుకోవాలని ప్రయత్నించిన వారే లేరు. చెబుతాను విను' అంటూ ప్రారంభించింది.

•  •  •

'శుభమా అని తొలిగా కాపురానికి పంపిస్తూ, తల చెడిన దాన్ని వెంట నేనెందుకమ్మా' అని అమ్మ నాకూడా రావటానికి ఒప్పుకోలేదు. అంచేత నేనొక్క దాన్నే ఆయనతో మా అత్తవారింటికి వెళ్ళి పోయాను.

పదినాళ్ళు మామూలుగానే గడిచి పోయాయి. కొత్తవల్ల కొంచెం భయంగానూ, బెరుగ్గానూ ఉండేది. ఇరుగుపొరుగు వాళ్ళు ఎందుకో చిత్రంగా నన్ను చూసి గుసగుసలాడుకునే వాళ్ళు. అంతే కానీ ఒక్కరూ మా ఇంటికి వచ్చి నన్ను పలక రించేవారు కాదు.


ఈ పదిరోజుల్లోనే నేనొక విషయం గ్రహించాను.

నాగభూషణం ఆ ఇంటికి మకుటం లేని మహరాజు. పాలేర్లకాయన పెద్దదొర. ఆయన వాళ్ళకు చూపుడు వేలు కదలికతో పనులు పురమాయించేవాడు; కంటిసైగతో శాసించేవాడు; ఒక్కమాటలో గడగడ లాడించేవాడు.

ఆయన నొసలు చిట్లిస్తే పెద్ద కమత గాడి దగ్గర్నించీ, చిన్న జీతగాడి వరకూ ధనుర్మాసపు చలిలో కాలవలో స్నానం చేసి నట్టు గజగజ వణికేవాళ్ళు. ఆయన కళ్ళెర్రచేస్తే తమకిక భూమ్మీద నూకలు చెల్లాయన్నట్టు హడిలి పోయేవాళ్ళు.

మావారు సయితం ఆయన చెప్పుచేత ల్లోనే మెలిగేవారు. నిజం చెప్పాలిసి వస్తే పెద్ద పాలేరు కంటే వో పిసరు పైపద విలో వున్న వుద్యోగిలా వుండేవారాయన.

ప్రతి పనికీ మేనమామ ముద్రపడాలి; ప్రతి కార్యమూ పెద్దాయన అజమాయిషీ లోనే జరగాలి; పని మాత్రమే మా వారిది;



# గాలిలో దీపాలు

పెత్తనమంతా నాగభూషణానిదే.

'ఆ పొలానికి ఎరువుతోలించు;' 'ఈ తోటలో ఆకు కోయించు' అని మేనమామ ఆజ్ఞాపించేవాడు; మేనల్లుడు తల వూగిస్తూ సరేననేవారు.

'ఈవేళ ఫలానిపొలంలో కోతకోయించు,' 'ఈ రాత్రికి ఈ కుప్పదగ్గర కాపలాకి వెళ్లు' అనేవాడు; తూచా తప్పకుండా ఆచరించేవారు మావారు.

తినీతినకా, ఎండనకా వాననకా, వేళ పొద్దున ఇంటినుండకా పంచె ఎగ్గట్టుకుంటూ కూలివాడిలా, ఈ పనిమీదా ఆపనిమీదా పరుగులు తీసేవారీయన.

చుట్టపొగ పీల్చుకుంటూ తీరిగ్గా పడుకుని, 'తమలపాకు బేరానికి ఫలాని వాళ్లని రమ్మన్నానని చెప్పు.' అని ఆజ్ఞలు జారీచేస్తూనో, 'రాత్రి కంది చేలో గొడ్లు దిగాయటనే? అక్కడే వున్నావ్‌గా నిద్ర పోతున్నావా? అంత బద్ధకమేం?' అని చివాట్లు పెడుతూనో, 'ఈసారయినా ఆపడమటి వైపు మాగాణంలో దిగుబడి బాగా వుంటుందంటావా?' అని ఆరా తీస్తూనో యాజమాన్యపు హోదా వెలగ బెట్టుకునేవాడు నాగభూషణం.

ఇంట్లోనే కాక బయటగూడా ఆయన గారి ప్రాభవం మెర్క్యురీ లైటులా వెలిగి పోతోంది.

అన్ని పల్లెటూర్లలో ఉన్నట్టే ఆ వూళ్లోనూ రెండు పార్టీలు వున్నాయి. వింత ఏమిటంటే రెండు వర్గాలవారికీ నాగభూషణం సన్నిహితుడే. ఒకతడవ ఒక పార్టీవాళ్లతో మంతనాలాడితే, మరో సమయంలో మరోపార్టీవాళ్ల చెవులు కొరికేవాడు. లౌక్యంగా నొప్పింపక, తానొవ్వక తప్పించుకు తిరిగేవాడో, లేక అదునెరిగి మరో సమిధవేసి, ఎగసనతోసి తమాషా చూసేవాడో ఆ భగవంతుడికే తెలియాలి మరి. ఆ ఇరు తెగల పార్టీ మనుషులూ ఆయన్ని విశ్వాస పాత్రుడుగానే పరిగణించి గౌరవించేవాళ్లు.

పెద్ద మనుషుల్లో పెద్దమనిషి, తగు మనుషుల్లో తగు మనిషిగా చెలామణీ అవుతున్న నాగభూషణం [illegible] తీర్పుకూ తిరుగులేదు ఆ వూళ్లో.

సుష్టుగా భోంచేసి వీధి వరండాలో [illegible]లాంటి పాతకాలపు కొయ్య[illegible] ఆసీనుడై, చుట్టపొగ రైలింజన్లా గుప్పుగుప్పుమని వదుల్తూ ఆయన విశ్రాంతి తీసుకునే వేళల్లో, ఎందరెందరో సలహాలకోసమో, తగాదాల తీర్పు కోసమో, సహాయం కోసమో వస్తూండే వాళ్ళు. వాళ్లకాయన సాక్షాత్తూ ధర్మరాజు; ఆయన నోటివెంట వెలువడిన ప్రతి పలుకూ వేదాక్షరం; ఆయన ప్రతి ఆదేశమూ శిరోధార్యం వాళ్లకి.

కొత్తదాననని కూడా ఎంచక నిర్మొహమాటంగా నామీద కూడా అధికారం చెలాయించే ఆయనంటే నాకు భక్తిమాట ఎట్లా వున్నా ఒకవిధమైనటువంటి భయమూ వెగటూ కలిగాయి ఈ పది రోజుల అనుభవంలో.

ఒకరోజు మధ్యాహ్నంపూట భోజనాలయ్యాక నాగభూషణం యథాప్రకారం తన సింహాసనాన్నధిష్టించి ధూమకాష్ఠం వెలిగించుకుంటున్నాడు. మా వారు తూర్పువేపు పొలంలో అరక ఎంతదాకా సాగిందో చూడాలంటూ వెళ్లిపోయారెప్పుడో. ఏమీ తోచక పుస్తకమొకటి తిరగేస్తూ మా గదిలో పడుకుని వున్నాను.

అకస్మాత్తుగా వాకిట్లోంచి ఒక ఆడ గొంతుక పెద్దపెట్టున ఏడవటం, దానికి మరొకరి గొంతు నేపథ్య సంగీతంలా వెక్కిళ్లు పెడుతూండటం వినిపించి నా చదువుకి కొద్దిగా అంతరాయం కలిగింది.

మామూలుగా వూరివాళ్లెవరో తగాదా పరిష్కారాని కొచ్చుంటారని, నేనంతగా పట్టించుకోక మళ్లీ పుస్తకంలో లీనమై పోయాను.

కాని బయటి గొంతుకలు హైస్థాయివి కాబట్టి నేను ఒద్దనుకున్నా ఒక చెవిలో అవి దూరుతూనే ఉన్నాయి.

ఆవిడెవరో నాగభూషణాన్ని తెగ సాధిస్తోంది. మధ్య మధ్య ప్రాధేయపడుతోంది ఏడుస్తూ. ఆవిడ వాక్ప్రవాహంలో నడుమ నడుమ మా వారి పేరు కూడా ప్రస్తావిస్తోంది. నాగభూషణాన్ని మావయ్యా అంటోంది.

అందరినీ గదమాయించి కేకలువేసే నాగభూషణం మెత్త మెత్తగా సమాధానాలిస్తూండటం నాకు విడ్డూరమనిపించి సంగతేమిటో తెలుసుకోవాలనే కుతూహలం రేగింది.

ఆడవాళ్లు బాహాటంగా బైటకు కనిపించగూడదనీ, అవసరమయితే ఏ తలుపు చాటునించో మాత్రమే మగవారికి జవాబివ్వాలనీ నాకు మొదట్లోనే నాగభూషణం హెచ్చరిక చేశాడు.

అంచేత వీధి తలుపు వోర వాకిలిగా తీసి తలుపు వెనకాతలనించి తొంగి చూశాను.

సుమారు నలభై ఏళ్లావిడ నాగభూషణం కూర్చున్న కుర్చీ దగ్గరగా కాళ్లారజాపుకుని కూర్చుని బుడి బుడి దుఃఖాలు సాగిస్తూ ఏమేమో అంటోన్నది.

ఆవిడకు కొంచెం దూరంలో స్తంభాని కానుకుని వో పాతికేళ్ల యువతి బొటన వేల్తో [illegible] రాస్తూ నుంచుని ఒకసారి నా[illegible]కేసీ, ఒకసారి నేల మీద కూర్చున్నావిడకేసీ దిగులుగా చూపులు మారుస్తోంది.

తొంగి చూస్తున్న నన్ను ఆ మధ్యవయస్కురాలు పసిగట్టింది. అంతే. తక్షణం మాటలు ఆపింది. ఆవిడ చూపులు తీక్షణంగా మారాయి. కాలిలో దిగబడ్డ కంటకాన్ని చూసినట్టు చురుగ్గా చూసి కంఠాన్ని రెట్టించింది. నాకు అదటుపుట్టి వెంటనే

## ఓం నమః శివాయ

కం. బదలిక, భరించి రాసెద
బాధ్యత భారం నీదే నాది కాదే
బిరుదు లొద్దు దినము [illegible]
ఓదలి సేవసేతు దీనజనావళికిన్.

కం. బుద్ధి వద్దు బసవేశ్వరా
బూనితి నీ పాదయుగళధర్మ ధరిత్రిన్
బ్రుగుమహర్షిని కాదన్న
బ్రా, బభ్రుశనిశ్చపింగళమంద శౌరిని
నుతింతున్.

కం. జెడవలొద్దు, నీ ధ్యానమే
జెలను కాను, భక్తురాలను భుజంగ
భూషా
నైటుపడ నీ కృపన్
బొందు గూర్చెద పద్యముల్ ఫణిపతీ.

కం. బోను పరుల బోలికి
బోసుని ఆక్రందన అవలంబింపపశుపతీ
బండనెత్తి కొండెక్కి నిల్చెద
[illegible]బహుపరాక్ మని మంగళంపాడెదన్.

—రచయిత్రి: శ్రీమతి సరస్వతి గిరి

తలుపుదగ్గరగా నొక్కేసి అక్కడే నిల బడ్డాను.

బయట ఆవిడగొంతు వర్షపు హోరులా వినబడుతోంది.

'అయితే ఆ గ్రహాన్ని ఇంటికి గూడా తెచ్చిపెట్టారన్నమాట! నా బిడ్డ నీకేమి ద్రోహం చేసిందని మావయ్యా దానికంత అన్యాయం తలపెట్టావ్? అగ్నిసాక్షిగా ముడేసిన బంధాన్ని ఇంతచులాగ్గా విడదీసిన బిడ్డని అనాథని చేస్తావా? ఇన్ని ధర్మ పన్నాలు చెబుతావే...ఇంతమందికి నీతులు బోధిస్తావే ... నీబోటివాడు చెయ్యదగ్గ పనేనా ఇది?' అని నిగ్గదీస్తోంది. హఠాత్తుగా స్వరాన్ని సప్తమానికి దింపేసి, 'రానీ...కేశవనే అడుగుతాను నా కూతురు మెట్టిన గడపని ఇంకొకత్తె నెలా తొక్క నిచ్చాడో నా తమ్ముణ్ణే అడుగుతాను. తాళికట్టినదాన్ని ఏడిపించి, ఇంటికి ఆడ పడుచుని నావుసురుపోసుకుని మరొకత్తెతో ఎలా కాపురం వెలగపెడతాడో చూస్తాను.' అని రోదిస్తూనే బెదిరిస్తోంది.

ముందు అయోమయంగానే ఉన్నా తర్వాత లీలగా బోధపడుతోంది నాకు.

'తమ్ముడు' అంటో సంబోధిస్తున్న ఆ కేశవ మామారుకాదు కద...ఆవిడ మాటల్ని బట్టిచూస్తే ఆమె కూతురే మామారి ముందు భార్య అవుండాలి. అలా అయితే వెనకనించున్న ఆ అమ్మాయే ఆమెకూతురు మామారి ముందుభార్య అవుండాలి. అలా అయితే వెనకనించున్న ఆ అమ్మాయే ఆమె కూతురు; నా సవితి.

ఏమిటీ వైపరీత్యం!

మామారిముందు భార్య బ్రతికే వున్నదా? పైగా అక్కకూతురా? నేనెంత క్లిష్ట పరిస్థితుల్లో ఇరుక్కున్నానూ? నాగుండె లయ తప్పింది. ఒక్కసారిగా గాలిస్తంభించి నట్టు ఊపిరి ఆడలేదు.

ఒంట్లో సత్తువంతా ట్యూబుపెట్టి బయటకు తోడేసినట్టుగా అయి కాళ్లు చచ్చుపడి, నిస్సత్తువగా నిల్చున్నచోటనే కిందికి జారి తలుపుకి జార్లపడ్డాను.

(ముగింపు వైవారం)


అమృతాంజన్ గ్రైప్‌మిక్స్చర్

పాప ఆరోగ్యానికి, సంతోషానికి దివ్యామృతం

అజీర్ణం, వాయువు, కలతనిద్ర, వాంతులు, విరేచనాలవంటి బాధలు వెంటనే తగ్గిపోతాయి. ఆకలి, జీర్ణశక్తి బాగా ఉంటాయి. పాపాయి ఆరోగ్యం బాగుపడుతుంది.






అమృతాంజన్ లిమిటెడ్

FDS AG 1660 TEL A



దంత క్షయం ఉండదు! ...ఎన్నటికీ

ఆర్యన్ టూత్ బ్రష్‌తో ప్రతి రోజూ మీ పళ్లు తోముకోండి. బ్రష్ యొక్క శిరోభాగపు నిర్మాణం, బ్రిజిల్స్‌ను గట్టిగా పట్టుకుని ఉండే యాంకర్-గ్రిప్, హాండిలులో మలచబడిన థంబ్-గ్రిప్, ఇవన్నీ మీ మొత్తము పళ్ల వరుసను, వాటి మధ్యగల సందులను పూర్తిగా శుభ్రపరచుటలో తోడ్పడుతాయి.

స్టాండర్డ్, డీలక్స్, సూపర్, జూనియర్ మరియు బేబీ తరగతులలో హార్డ్, మీడియం మరియు సాఫ్ట్ రకములలో లభిస్తాయి.

ఆర్యన్ టూత్ బ్రష్

ఎక్కువ బాగా శుభ్రం చేస్తుంది — ఎక్కువ కాలం మన్నుతుంది.




ఇంకా ఇప్పుడు

క్రౌన్ ఆర్యన్

షేవింగ్ బ్రష్-ఇది

థరమ్-గ్రిప్ హాండిల్సుతో వెల్వెట్ ఫినిష్‌గల నైలాన్ బ్రిజిల్స్‌తో. ఎంతో హాయిగా షేవ్ చేసుకునే అవకాశం మీకు కలిగిస్తుంది. ప్రతి మొక్కం [illegible] పడేటట్లు పొదా రకంనుండి, ప్రత్యేక రకం వరకు ఎన్నో వేరువేరురకాలలో లభిస్తుంది.



Aryan

# పెదకథ

( గత సంచిక తరువాయి )


వరండాలో నాగభూషణం కంఠం మంద్రస్వరంలో నిర్వికారంగా వినిపిస్తోంది.

'ఇదిగో సామ్రాజ్యం!' అయిపోయిన దానికి అల్లరెందుకు పెడతావు చెప్పు? తప్పెవరిది? 'పిల్లని ఎన్నాళ్ళు నీ దగ్గర పెట్టుకుంటావు పంపవే' అని చిలక్కి చెప్పినట్టు బతిమలాడీ, బామాడీ చెప్పానా నీకు? విన్నావా? నా పంతమే నాదని తలాయించావ్... అలాక్కాదని కరణం గారిచేత చెప్పించాను. అప్పటికైనా విన్నావా? పెడ చెవిన పెట్టావ్; అందర్నీ కాదని కొండ కొమ్మెక్కి కూర్చున్నావే...ఒక రోజా రెండు రోజులా ఏణ్ణర్ధం వోపికపట్టాను. ఇంకెంత కాలం ఎదురు చూడమంటావ్? నాలాగే వాడూ విదురుడయితే వంశ నిర్మూలన మయిపోతుందే,— ఏ లోకంలో వుందో నా అక్క నన్ను క్షమించదే ... అన్న క్షోభ నన్నెంత పట్టిపల్లారిస్తే నేను వాడికి మళ్ళీ పెళ్ళి తలపెట్టానో నీకు తెలుసునా?

ఇప్పుడొచ్చి ఇది నీకు తగునా అని నన్ను నిలేస్తే నేనేం చెయ్యగలను? అయినా ముందునించీ నీ కోరికల్లా కూతుర్ని దగ్గరుంచుకోవాలనేగదా ... ఇక నిరాక్షేపణగా ఉంచుకో ... నిన్నింక ఎవ్వరూ నీ కూతుర్ని అత్తవారింటికి పంపవే అని బలవంతం చెయ్యరు.'

మంచు పైకి చల్లగానే ఉంటుంది కాని నిప్పువలె అది కూడా శరీరాన్ని కాల్చేస్తుంది. నాగభూషణం చల్లగా మెల్లగా యుక్తి యుక్తంగా విసిరిన వ్యంగ్యం చురుక్కున తాకింది కాబోలు సామ్రాజ్యానికి. ఆవిడ గొంతు తారస్థాయికి పెరిగింది.

'పుట్టింటి దగ్గర ఏణ్ణర్థం కాదు పదేళ్ళుంటుంది మావయ్యా. తప్పేముందో చెప్పు? ఒక్కగానొక్క బిడ్డ అవటంవల్ల మరి కొన్నాళ్ళు కళ్ళముందుంచుకోవాలని ముచ్చటపడిన మాట నిజమే. నాది మూర్ఖపట్టే ననుకో... కాని నాకు బుద్ధి చెప్పాలిసిందీ విధంగానేనా? మేనల్లుడి సంసారం వర్ధిల్లాలనే చూశావుగానీ, ఇటు నా కూతురు నీ కూతురివంటిది కదా— దాని కాపురం కూల్చేస్తున్నానని మనసులో



# గాలిలో దీపాలు

నైనా తలిచావా ? చెప్పు! ఇప్పుడు దీన్నే గంగలో దిగమంటావో చెప్పు!' కడిగేస్తోంది స్వామ్రాజ్యం. బెల్లం కొట్టిన రాయిలా మాట్లాడలేదు నాగభూషణం.

ఇంకా వాళ్ల సంభాషణ ఏ ఏ ఘట్టాలు దాటేదో గాని, ఇంతలో పొలాన్నించి మావారు రావటంతో అంతటితో అంత మయింది.

ఆయనతో పాటుగా స్వామ్రాజ్యమ్మా, ఆవిడ కూతురూ కూడా లోనికి వచ్చారు. నేరం చేసినదానిలా నేను ముడుచుకుపోతూ గదిలోకి వెళ్ళిపోయాను.

సొంత ఇల్లన్నంత దిమాగా వంట ఇంట్లో ప్రవేశించి ఆయనకు భోజనం వడ్డించింది స్వామ్రాజ్యమ్మ. మళ్లీ ఆయన పొలం వెళ్లేవరకూ 'తమ్ముడూ తమ్ముడూ' అంటూ, వెనకాలే తిరుగుతూ, ఏదో చెబుతూ గదిలోకి రానివ్వలేదు ఉపాయంగా.

రాత్రి తనే మడి కట్టుకుంది. వడ్డనా తనే చేసింది. భోజనాల దగ్గర మళ్ళీ వాదన లేచింది; నాకు మరికొన్ని అంశాలు బోధపడ్డాయి; వాటితో నా వూహల్ని జోడించి నేను చాలావరకూ గ్రహించ గలిగాను.

స్వామ్రాజ్యం మా వారి పినతల్లి కూతు రట. మా వూరికి పక్కనే ఉన్న మరో పల్లెటూరిలోనే వారి నివాసం. సీత ఒక్కతే ఆమెకు సంతానం. మేనల్లుడి ఆస్తి రెట్టింపవుకు పెరుగుతుందనే అత్యాశకొద్దీ మేనరికం ఇష్టపడే చేశాడు నాగభూషణం.

ఆ తరవాతే వచ్చింది మతలబు. స్వామ్రాజ్యమూ, ఆమె పెనిమిటీ, కూతుర్ని విడిచి వుండలేక, తమ్ముడిల్లే కదా అని కూతురితోపాటు వారూ ఇక్కడకు చేరు కున్నారు. వచ్చినవాళ్లు వచ్చినట్టుంటే ఇన్ని అనర్థాలు వాటిల్లకపోను.

నాగభూషణం తమ అల్లుడి ఇంటిని ఏకఛత్రాధిపత్యంగా ఏలటం కంటగిం పయింది స్వామ్రాజ్యమ్మ దంపతులకి అక్క కొడుకనే అభిమానంతో ఆదుకొని, చిన్న ప్పటినించీ పెంచి, పెద్దచేసి, ప్రాజ్ఞుడిని చేసిన మాట నిజమే కావచ్చును. కాని ఇన్నేళ్ళూ ఈ ఐశ్వర్యాన్ని ఎదురులేకుండా అనుభవించాడు కద. ఇంకా ఆ పదవినే అంటిపెట్టుకునుండాలనుకోడం దురాశే అని భావించారు వాళ్ళిద్దరూ. స్వయంగా ఇక తమకు సంక్రమించాలిసిన ఆధిపత్యాన్ని ఆయనింకా ఒదులుకోకపోవటం అక్రమ మనుకున్నారు; ఎలాగయినా ఆ అధికారాన్ని తమ హస్తగతం చేసుకోవాలని తలచారు.

దానితో నాగభూషణానికి తొందర కలి గింది. ఉపేక్షిస్తే తన పీఠానికి ముప్పు తప్ప దని గ్రహించాడు. ఇన్నాళ్ళ తన స్వయం జావుటా ఎగిరిన ఆ వూళ్ళోనూ, ఆ ఇంట్లోనూ ప్రతి కక్షు లేర్పడడం తన ప్రతిభకే సవాలనుకున్నాడు. 'మేనగోడలు గదా' అని దయతలిస్తే లాభం లేదనీ, వాళ్లని ఇక్కణ్ణించి ఉద్వాసన పలకాలనీ నిర్ణయించుకున్నాడు.

మేనల్లుడు ఇంకా తన పరిధిలోనే మెలుగుకుతున్నాడు గాబట్టి, స్వామ్రాజ్యమ్మ దంపతుల ఆటకట్టించాడు. తన శక్తి యుక్తులన్నీ ప్రయోగించి వాళ్ళు ఇక్క ణ్ణించి కదిలేవరకూ వూదరగొట్టి తరిమే శాడు.

అపజయంతో, అవమానంతో తమ ఇంటికి జేరుకున్న స్వామ్రాజ్యం దంపతులు నాగభూషణం కోరలూడ బెరకటానికి మార్గాలన్వేషించారు.

స్వతహాగా తమ అల్లుడు ఒహొమెతక. నోట్లో నాలిక లేనివాడు. అతన్నట్లా తయారుచేసి తన గుప్పిట్లో యిరికించు కున్నాడు నాగభూషణం. తనదంటూ గుడ్డి గవ్వ లేకపోయినా అష్టైశ్వర్యాలు అనుభ విస్తున్నాడు. అతని ఆట కట్టించాలంటే అల్లుణ్ణి తమవైపుకు మళ్లించుకోవాలి. కూతురిద్వారా అల్లుణ్ణి లోబరచుకోవడం తేలిక.

పండగవంకన కూతురు సీతని తమ ఇంటికి రప్పించుకున్నారు. సీతకోసం అల్లుడు తమ ఇంటికి వస్తాడని, ఆ సమ యంలో అతన్ని మంచి మాటలతో తమ వైపు తిప్పుకోవాలనీ వారి పథకం.

కాని నాగభూషణం వారి ఎత్తు సాగ నిచ్చాడు కాదు. మేనల్లుణ్ణి అటువేసి తొంగిచూడనివ్వలేదు. వాళ్లతోనూ, పిళ్ళ తోనూ కబుర్లు పెట్టాడు 'పిల్లని పంపించూ' అని.

ఆ కబురులో 'నాతో నువ్వు పోటీ పడ్డం పొట్టేలుతో మేకపిల్ల ఢీ కొనడం వంటిది సుమా! ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకో' అన్న హెచ్చరిక వినిపించింది స్వామ్రాజ్యానికి. మరీ బిర్రబిగిసి సీతని తన దగ్గరే ఉంచేసుకుంది; 'ఏం జేస్తావో చేసుకో' అన్నట్టు. నెలలు గడిచాయి. ఎవరి పంతాలూ సడలలేదు.

స్వామ్రాజ్యమ్మ కొత్త ఉపాయంపన్నింది. పొలంలో కుప్పదగ్గర కావలాగా పడుకుం టున్న అల్లుణ్ణి మేనమామకి తెలియకుండా రహస్యంగా తమ ఇంటికి రప్పించుకోవటం ప్రారంభించింది.

అవురిస్తే పేను తెక్కపెట్టే నాగ భూషణం దృష్టిలో ఈ చాటుమాటు వ్యవహారం పడనేపడింది మేనల్లుడు తన చెయిజారి పోతున్నందుకు గాభరాపడ్డాడు. తను గీసిన గిరి దాట సాహసించని అల్లు గాడు తన చాటున అంతకు తెగించాడంటే వయసులోవున్న అతనికి స్త్రీ సాంగత్యం ఎంత ముఖ్యమో కూడా బోధపడిందాయనకి.

స్వామ్రాజ్యం పరం అణచటానికీ, మేనల్లుడి అవసరం తీర్చడానికీ ఒకే పరి ష్కారాన్ని ఎన్నుకున్నాడు నాగభూషణం. దాని ఫలితంగానే నా వివాహం జరిగింది. మేనల్లుడు నంగినంగిగా అడ్డుచెప్పినా విని పించుకోలేదట. మూడో కంటికి తెలియ కుండా మా సమ్బంధం కుదుర్చుకున్నాడు. బంధువు లెవ్వరికీ తెలియనివ్వలేదు తనకు పక్కతాళం వేసే ఒకరిద్దరిని మాత్రమే వెంటపెట్టుకొని వచ్చి పెళ్లితంతు ముగిం చాడు.

పల్లెటూళ్ళలో రహస్యాలు దాగవు, పొద రసంలా క్షణాల్లో పాకిపోతాయి. ఈ వార్త స్వామ్రాజ్యమ్మ దంపతులకు శరాఘాతంలా తగిలింది గుండెల్లో గుబులు బయలు దేరింది స్వామ్రాజ్యమ్మకి

'ఎంతయినా నాకూ మేనమామే కద... ఎప్పటికయినా రాజికి రాకపోతాడా' అని అనుకున్నది గనీ ఇంత ఘోరానికి తల పెడతాడనుకోలేదావిడ.

ఇటు తల్లి తండ్రి అటు నాగభూ షణం తన జీవితాన్ని పరిచి ఆడుతోన్న చదరంగాన్ని చూస్తూ లోలోపలే ఆందోళన పడుతోన్న సీత, 'నా సంసారాన్ని చేతులారా పిండే కాలదోశారని' మొట్ట మొదటి సారిగా నోరు విప్పి కుమిలిపోయింది.

'దావా పడేస్తాను. ఆ పెళ్లిలాగ చెల్లు

ఉందో చూస్తాను.' అని కారాలూ మిరియాలూ నూరాడు స్వామాజ్యమ్మ భర్త.

స్వామాజ్యమ్మ ముందు చూపుతో ఆలోచించింది 'నిజమే. కోర్టు కెక్కితే ఆ పెళ్ళి నిలవదు. కాని ఆ తరవాత తనని కోర్టు కీడ్చించారన్న కక్షకొద్దీ తాచు పాములాంటి నాగభూషణం తన కూతురి కాపురానికి కాటు వెయ్యక మానుతాడా? ఊహూ...ఇది మంచి పద్ధతి కాదు. సీత సంసారం కుదుటపడాలంటే, 'శరణం మమ' అని ఆయన కాళ్ళు పట్టుకోవటమే ఉత్తమం' అనుకున్నదావిడ తరుణం మించాక కళ్ళు తెరుస్తూ.

పడుతూ లేస్తూ కూతురితోసహా వచ్చి పడిందందుకనే.

తప్పు తమదైనా దోషం మరొకరికి ఆపాదించడం ధూర్తత్వ లక్షణం. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా, తన మూర్ఖప్పట్టు కారణంగా కూతురి సంసారాన్ని ఇరకాటంలో పడేసిందికాక మరో అభం శుభం తెలియని ఆడపిల్ల జీవితానికి చిచ్చు పెట్టానన్న విచారం స్వామాజ్యమ్మకు లేకపోగా, దీనికి పూర్తి కారణ భూతురాలిని నేనే నన్నట్టు నన్ను చూసీ చూడగానే గ్రహన్నంటో కూరాకులో పురుగును చూసినట్టు చీదరించుకున్నది.

ఆ రాత్రి నన్ను భోజనం చెయ్యమని అడిగినవారులేరు. నాకు ఆకలి కాలేదు. అలాగే ఆ గదిలో ఒకమూల ఒదిగి కూర్చున్నాను పరాయిదానిలా.

చాలా రాత్రివరకూ ముందు చావిట్లో నాగభూషణమూ, స్వామాజ్యమూ మెల్లగా గుసగుసలాడుతోనే ఉన్నారు.

ఒక రాత్రివేళ, మావారు నేనున్న గదిలోకివచ్చారు. ఆయన గుండెలమీద వాలి ఏమిటీ అన్యాయమని ఏడ్చాను. కరిగిపోయారాయన. 'ఈ కుతంత్రమంతా మేనమామదే అనీ, ముందునించీ ఆయన ఒద్దికలో మెలగడంబట్టి ఆయనేంచేసినా ఎదురు తిరగలేకపోతున్నాననీ' వాపోయారాయన.

ఆయన మాటల్లో నాకే రక్షణా దొరకలేదు; ఏ పూరటా కలగలేదు; ముందేం జరగబోయ్యేదీ కూడా ఆ మేనమామ చిత్తంమీదే ఆధారపడివుంటుందని అర్థమయిపోయింది నాకు.

మధ్యాహ్నంనించీ అలజడితో, అశాం

# గాలిలో దీపాలు

తితో అతలాకుతలమయిపోతున్న మనస్సు విశ్రాంతి కోరింది; ఒళ్ళు తెలియకుండా నిద్రపట్టింది. ఎంతసేపు అలా నిద్రపోయానో తెలియదుగానీ, నా భుజంపట్టి కుదుపుతూ స్వామాజ్యమ్మ నన్ను లేపింది. ఆలుమగలు ఏకాంతంగావున్న గదిలోకి అంత చొరవగా ఎలా రాగలిగిందో నా కర్థంకాలేదు; నిద్రమత్తులో ఉన్న నన్ను, 'ఇవతలికి రమ్మ'ని ఆజ్ఞాపించింది

అయోమయంగా బయటకు వచ్చాను. పాల గ్లాసు చేత్తోపట్టుకుని లోపలికి వెళ్ళి తలుపు బిగించుకున్నది స్వామాజ్యమ్మ కూతురు సీత.

ఒక్కసారిగా నిద్రమత్తంతా ఒదిలిపోయి నిర్ఘాంతపోతూ నిలబడిపోయాను. నావైపు నిర్లక్ష్యంగా చూస్తూ ముందు చావిట్లోకి వెళ్ళిపోయింది స్వామాజ్యం. మిగతా రాత్రంతా నాలో నేనే కుమిలిపోతూ జాగారం చేశాను.

తెల్లవారింది నాగభూషణంతో ఎలా రాజీ కొచ్చిందో తెలియదు; ఇల్లంతా తానే అయి వ్యవహరిస్తోంది స్వామాజ్యమ్మ.

నాగభూషణం చెప్పినదానికి అవుననంటూ స్వామాజ్యమ్మూ, స్వామాజ్యమ్మ అన్నదానికి 'కాదూమరి' అంటూ నాగభూషణమూ ఒకరికొకరు వంతపాట పాడుతున్నారు.

బహుశా నాగభూషణం అధికారానికి తలఒగ్గి, దాసోహమని, తన కూతురి సంసారానికి అభయమిమ్మని స్వామాజ్యమ్మ అర్థించి వుంటుందని ఊహించాను.

ఆయన అహంకారానికి విజయం లభించాక, మేనగోడలిమీద తన కటాక్ష వీక్షణాలు బరిపించటం సహజంగానే జరిగిపోయి వుంటుంది.

కాగా ఇప్పుడు ఒకరినొకరు మంచి చేసుకోవటం అవసరంకూడానూ. తనుచేసిన తప్పుడు పనిని రచ్చ కీడ్వకుండా నాగభూషణమూ, ఏదోవిధాన కుమార్తె సంసారం నిలబెట్టడం కోసం స్వామాజ్యమ్మా తోడుదొంగలు కావటంలో వింతేమీలేదు.

'అబోతుల పోరాటంలో మధ్య నలిగిన లేగదూడ'లా మిగిలాను నేను.

నాగభూషణం నన్ను చేరబిలిచి నన్ను అట్టే బాధ పడవద్దని, స్వామాజ్యమ్మ నన్ను ఒక కూతుర్లాగే చూసుకుంటుందనీ, నేను సీతను తోబుట్టువులా మన్నించాలనీ...ఇంకా ఇలాంటివే నాలుగు ఓదార్పు మాటలు చెప్పాడు.

ఏమనగలను! కలితో ఉన్నవాడిముందు అరిటాకువరిచి, పిండివంటలు వడ్డించి, తీరా కబళమెత్త బోయేవేళకు, 'ఏకు కాదిది' అని హెచ్చరించి, 'విచారించవద్దని' ఓదారిస్తే గుక్కిళ్ళు మింగటం మినహా ఏమనగలరు ఎవరైనా?

దుఃఖం గొంతుక్కడ్డం పడుతోంటే ఆయనకేమీ బదులు చెప్పలేక పోయాను. ముందునించీ నాకు ఓర్పుతోపాటు కర్మ సిద్ధాంతాన్నికూడా నూరిపోసేది మా అమ్మ. ఈ కష్టకాలంలో నాకా సిద్ధాంతమే అక్కర కొచ్చింది. ఇదంతా నా ఖర్మ; నేచేసుకున్న ప్రారబ్ధం అనుకుంటూ నన్ను నేనే సముదాయించుకొనేదాన్ని.

ఆవేళటినుంచీ ఇంట్లో పెత్తనం సీతదయింది నేనన్న మనిషిని ఉన్నట్లే ప్రవర్తించేది కాదు. అందరూ తినగా గిన్నె అడుగున మిగిలిన పిడికెడు మెతుకులే నాకు గతి అయ్యేవి. అందుకు విచారపడను నేను. కానీ ఒక్కనాడూ నాభర్తని నాకళ్ళ పడనిచ్చేది కాదు సీత. చెదురుమదురుగా ఎదురైనా నా ఎదురుగా తల తిప్పుకుని వెళ్ళిపోయేవారాయన.

వూళ్ళోవారి సానుభూతి కూడా సీతకే దక్కింది. ఇంటికొచ్చిన ప్రతి ఒక్కరూ, యిరుగుపొరుగులు సయితం 'ఏం సీతా ఒచ్చేశావుకద... పండంటి సంసారాన్ని కాల దన్నుకుంటున్నావే' అని ఇన్నాళ్ళూ తెగ బాధ పడేవాళ్ళం సుమా' అనేవాళ్ళు.

నేను వారిదృష్టిలో ఈ ఇంటి కోడలిని కాదు సరికదా ఆస్తి కాజేయటానికి వచ్చిన ఒకానొక నెరజాణని; దుర్మార్గురాలిని.

ప్రతి క్షణం ఈ నరకంనుండి పారిపోవాలనీ, అమ్మ గుండెల్లో దూరి కరువుతీరా ఏడవాలని అనిపించేది

కాని నేను సుఖపడుతున్నాననే భ్రమలో నిశ్చింతగా వున్న అమ్మ గుండెల్లో ఆరని చిచ్చు నా అంతట నేనే రగిలించలేక పోయాను.

రోజులు గడుస్తున్నాయి స్వామాజ్యమ్మ

వస్తూ పోతూ వుండేది. నా దుస్థితిలో ఏమాత్రం మార్పు లేదు

ఒకసారి సాహసంచేసి సీత ఏమరుపాటుగా వున్న సమయంలో మా వారి గదిలో ప్రవేశించి గడియ వేశాను

ఇన్నాళ్ళబట్టి నాలో పెరుకుపోతున్న వ్యధ గుమ్మరించాను వారి ముందు.

'ఏ పాప మెరుగని నా కెందుకీ శిక్ష?' అని మొత్తుకున్నాను; 'జరిగిపోయిన సంగతుల్ని నేనూ తరిచి అడగను నన్నూ సీతతోపాటుగా చూసుకోమని' మొరపెట్టుకున్నాను. వారి ఆసరా నాకుంటే ఎంతటి కష్టాన్నయినా భరించగలనని ప్రాధేయపడుకున్నాను

నా వంక అశక్తతగా చూశారాయన. 'సీత అన్ని విషయాలలోనూ మంచిదే. నీ పేరెత్తితే మాత్రం కొరకొర లాడుతుంది గట్టిగా చెప్పబోతే ఏడుపు మొదలెడుతుంది. నేనేం చెయ్యను చెప్పు' అన్నారు.

నా మీద దయ చూపించాలనంటే, అందుకు సీత అనుజ్ఞ కావాలన్న మాట. ఎంత దౌర్భాగ్యురాలిని నేను!

నిజమే. సీత వారికి రెండు భార్య. వారి ప్రేమానురాగానికి ఉసర్హైన హక్కుదారిణే.

ఇక నేనో! మెడలో తాళివున్నా దానికో విలువ లేనిదానిని; ఆ ఇంట జీతం తీసుకుని పనిచేసే సేవకులకుండే స్థానమున్నా లేని దాన్ని, కనీసం తళుకు బెళుకులతో నయగారపు పలుకులతో వారిని ఆకర్షించుకుని వశపరుచుకునేందుకు తగిన అంద చందాలయినా ప్రసాదించాడు కాదా భగవంతుడు

కళ్ళనిండా కూడుకున్న నా కన్నీరు బయటకు పొర్లనేలేదు. గది తలుపులు దబదబ బాదేస్తోంది సీత. తలుపులు తెరిచాను; నన్ను కాల్చేసేలా చూసింది సీత

సామ్రాజ్యమ్మ నా రెక్క పట్టుకుని బయటకు నడిపిస్తూ, 'ఉత్త పిల్ల కూడా కాదు దాని మనసు కష్టపెట్టబోకమ్మా' అంటోంది

త్వరలో తల్లి కాబోతున్న సీత ఆ ఇంటి సర్వాధికారిణిగా స్థిరపడుతోంది ఇక ఆ గదిలోనే కాదు, ఈ ఇంట్లోనే నాకు స్థానం లేదు.

పైగా—

నా దీన స్థితిని అలుసు చూసుకుని పాలేరు కొండయ్య నా వంక ఒదో రంగా చూడ్డం ప్రారంభించాడు

పాలచెంబు అందిస్తూ వేళ్ళు తాకించడం, సామాన్ల గదిలో గోనె సంచుల కట్ట తీసుకువెడుతూ, అక్కడే వంటరిగా పడుకున్న నన్ను చూసి, 'ఏందమ్మా ఈడ పడుకున్నావ్' అంటో వెకిలిగా నవ్వటం, అవసరం లేకపోయినా కలిపించుకుని ఏదో ఒకటి నాతో వాగటం మొదలుపెట్టాడు.

వాడి తెంపరితనానికే నేనో పక్క హడలిపోతూంటే, 'నాడితో నీకు మాట లేవిటి?' అని దీర్ఘంతీస్తో అనుమానంగా చూస్తోంది సీత.

సీత ఏమి చెప్పిందో ఏమిటో, 'చూడమ్మాయ్! మాది పరువుగల కుటుంబం. నువ్వు విచ్చలవిడిగా పాలేర్లతో రాసుకునీ, పూసుకోవటం ఎవరైనా చూస్తే తల ఎత్తుకు తిరగలేం జాగ్రత్తగా మసులుకో' అంటూ హితబోధ చేశాడోనాడు నాగభూషణం.

సిరిసంపదలు తొలలాడే ఆ ఇల్లు నా కళ్ళకొక దారీడొంకా లేని కీకారణ్యంలాగా, ఆ కొంపలోని మనుషులంతా నన్ను కబళించడానికి పొంచి చూస్తున్న క్రూరమృగాల్లాగా అనిపించి గజగజలాడిపోయాను.

నా ఓరిమి అడుగంటిపోయింది. ఆ ఇంట దినదిన గండంగా మనుగడ సాగించడం దుర్భరమనిపించింది. అమ్మకు ఉత్తరం రాశాను. మూడోనాటికల్లా రెక్కలు కట్టుకు వాలింది

కలలోనైనా ఊహించని నా దౌర్భాగ్యానికి గుండెలవిసేలా విలపించింది.

శాంతస్వభావురాలైన మా అమ్మ ఉగ్రకాళై నాగభూషణాన్ని తూర్పారబట్టింది.

ఎదుటివాళ్ళు హెచ్చితే తను తగ్గటం, వాళ్ళు తగ్గినప్పుడు తాను పెచ్చురేగటం నాగభూషణం లౌక్యానికి నిదర్శనం.

ఆయన మెత్తమెత్తని సమాధానాలు విని అగ్నిహోత్రంమీద నీళ్ళు చిలకరించినట్టు చల్లబడింది అమ్మ.

'తను మాకు చేసిన వంచన ఏమాత్రం లేదన్నాడు; రెండోపెళ్ళని ముందే చెప్పానన్నాడు; ముందు భార్యలేదని తన నోటితో చెప్పలేదన్నాడు; అల్లరి చేసుకోడంవల్ల ప్రయోజనమేమీలేదనీ, అది మాకే ముప్పనీ అన్నాడు; ఏ న్యాయస్థానమైనా సీతపక్షానే నిలబడుతుందిగానీ, నా తరఫున కాదని గ్రహించమన్నాడు; ఇప్పటికైనా మించిపోయిందేమీలేదని, తన మేనల్లుడు పద్మ్మ




""బెంగాలీ ముస్లిములు వాళ్ళింతటికే తిరుగుబాటు కాబోలు...""

కాదు ముగ్గురినయినా పోషించే స్తోమతు గలవాడేననీ' అన్నాడు నాగభూషణం

చేదుగానేఉన్నా ఆయన చెప్పిన మాటలన్నీ నిజాలేనని ఒప్పుకోక తప్పదు. నాలుగు రోజుల్లోనే నేను నోరు విప్పి చెప్పకుండానే ఆ ఇంట్లో నేను అనుభవించే వైభోగం అవగహన అయింది అమ్మకి.

చివరిసారిగా నాగభూషణానికి చెయ్యెత్తి దణ్ణంపెట్టి నన్ను తీసుకు వచ్చేసింది అమ్మ. ఆ నమస్కారం నాగభూషణానికో ఆయన దుష్టత్వానికో తెలియలేదు నాకు.

* *

చెప్పడం ముగించి నిట్టూర్చింది వరలక్ష్మి. నా మనసంతా వికలమయిపోయింది. కనుకొలుకుల్లో నీళ్ళు నిలిచాయి.

'ఇంత చిన్న వయస్సులోనే ఎన్ని అగచాట్లు పడ్డావ్ వరలక్ష్మీ' అన్నాను సానుభూతితో.

అప్పుడే వంటయింటిలోంచి ఇవతలకు వచ్చి మాదగ్గరగా కూర్చుంటూ అన్నది తాయారమ్మ.

'అవునమ్మా తోడేళ్లమధ్య కుందేలు కూనలా నాబిడ్డ అక్కడ ఎన్నికడగండ్ల పాలయిందో, చెప్పకునేందుకు నా అన్నవాళ్ళులేక ఎంత అల్లాడిపోయిందో తలుచుకుంటేనే నా గుండె నీరవుతూంటుంది' ఆవిడ మాటలు కన్నతల్లి మమకారం రంగరించి పోసినట్లున్నాయి.

హఠాత్తుగా గుర్తువచ్చింది నాకు. 'అవునూ ... సోమావధాన్లుగారూ మీరూ ముందునించీ ఎంతో పొత్తుగా, కలిసికట్టుగా ఉండేవారు కదా...మరి ఈ అకాల వైరానికి కారణ మేమిటీ? ఆయన భార్యే స్వయంగా మీమీద అవాకులూ, చెవాకులూ పేలుతున్నదటగదా? ఎందుకు వాళ్ళకంత కక్ష?' మిగిలిపోయిన నా సందేహాన్ని బయటపెట్టాను కుతూహలంగా.

'కక్షకాదు తల్లీ! చేసిన ద్రోహన్ని కప్పిపుచ్చుకునేందుకు వేసిన ఎత్తు! మాకిక్కడ నిలువ నీడలేకుండా చేసి తాను బాగుపడాలని చేస్తున్న ఎక్కజిత్తులివి' తాయారమ్మ మొహం కందగడ్డయిపోయింది. కళ్లల్లో ఎర్రటి జీరలు పాకాయి.

తిరిగీ ఆవిడకావిడే సంభాళించుకుని నిట్టూరుస్తూ మళ్లీ అన్నది 'అయినా మా దురదృష్టానికి ఒకర్నని ఏం లాభం తల్లీ! రాతలో రాళ్ళు మొయ్యమని వుంటే, రాజ్యాలు ఏలటం ఎలా సాధ్యమవుతుంది?' అన్నదావిడ విరక్తిగా.

మూలం అంతుపట్టలేదు నాకు. అదే అడిగాను మళ్లీ.

'ఏం చెప్పేదమ్మా! మనుషుల్లో ఇంత స్వార్థం బుసలుకొడుతూ ఉంటుందనుకోలేదు. పేనుకు పెత్తనమిచ్చినట్లు ఆ సోమావధానుల్ని నమ్మి సమ్మంధం విషయం విచారించి రమ్మని పంపినందుకు మాకు తగిన ప్రాయశ్చిత్తం చేశాడు.

నాగభూషణం దౌర్జన్యానికి దడిచి బయటకెవరూ చెప్పకపోయినా, ఆపూరి మునసబు, ఈయన్ని చాటుగాపిలిచి, అసలు సంగతంతా చెప్పి 'వాళ్ళూ వాళ్ళూ అయినవాళ్లు ..బంధువులు ఇవ్వాళ మాటమాట అనుకుని దూరమయినా రేపు కలుస్తారు. చూస్తూ చూస్తూ నూరేళ్లపంట కావాలిసిన నో ఆడపిల్ల బతుకుని ముళ్ల డొంకల్లోకి లాగుతూంటే ఊరుకోలేక ఈ సాహసంచేశాను. ఏదో సాకుతో ఈ సమ్మంధం తప్పించండి మీరు' అని చెప్పాడట వరాన్ని తీసుకొచ్చేస్తూండగా ఆ మునసబే నాకూ కనబడి ఈ విషయంచెప్పి తెగ విచారించాడు.

ముక్కూ మొహం తెలియని వో పరాయి మనిషికున్న సద్భావంకూడా ఈ సోమావధాన్లకి లేకపోయింది.

ఆ నాగభూషణం ఏం ఎరచూపించాడో నిజాన్ని తొక్కిపట్టి మాకళ్లు కప్పాడు. ఇహనిప్పుడు తన బండారం నేను బయటపడేస్తానని ఈకొత్త ఎత్తు ఎత్తాడు. దీనికి వెనకాల నాగభూషణం మద్దతు గూడా ఉన్నట్టుంది.

అదిస్నీగాక అదిగో ఇదిగో అనటమే కాని ఈ కొంపలకింకా పట్టాలు పుట్టనే లేదు. మమ్మల్నిలా నసుబాట్లు పాల్జేసి, మేమీవాదు భరించలేక ఇక్కణ్ణించి తప్పుకుంటే ఈ కాస్త జాగకూడా తన స్థలంలో కలుపుకోవచ్చనే దుర్బుద్ధితో ఇంత ఆగడం చేస్తున్నాడు. 'ఇదిగో పులంటే, అదిగో తోక' అని కళ్ళు మూసుకుని తందానా అనే ఈ లోకంలో ఎదురులేకుండా పారింది అతని కుతంత్రం.'

తాయారమ్మ నిర్లిప్తంగా చెప్పాలని, ఆవేశాన్ని అదుపులో పెట్టాలనీ చేసిన వృథా ప్రయత్నం నాకు అడుగడుగునా అవగతమవుతూనేవుంది.

అన్యాయమూ, అబద్ధమూ ఎరుగని నిర్మల హృదయుల్నీ, అమాయకుల్నీ మూడో కంటికి తెలియకుండా యాతన పెట్టగల సమర్థులూ, స్వప్రయోజనాలకోసం అతి నికృష్టంగా దిగజారిపోయే స్వార్థపరులూ ఈ లోకంలో అడుగడుగునా వుంటారని అనుభవమయింది నాకు.

సర్వమూ కోల్పోయినవారికి ఉపశాంతి వాక్యాలేం పలకను? మూగగా కూర్చుండిపోయాను.

సంధ్యాకాంత సౌభాగ్యాన్ని తుడిచివేస్తూ దినకరుడు కొండలమాటున కనుమరుగయ్యాడు. వాకిట్లో వ్యాపిస్తున్న క్రీనీడల్ని చూస్తూ, తాయారమ్మ విషాదంగా అంటోంది.

'మేమూ ఇక్కణ్ణించి వెళ్లిపోవాలను కుంటున్నామమ్మా' లని.

ఉలిక్కిపడ్డాను. 'ఎక్కడికి వెడతారు తాయారమ్మగారూ మిమ్మల్నాదుకునేవారెవరున్నారు?' తెలియకుండానే నా కంఠం ఒణికింది.

విరాగిలా నవ్వింది తాయారమ్మ 'తెగిన గాలిపటాల్లాంటి వాళ్ళం...గాలిలో దీపాలవంటి వాళ్ళం... గాలి ఎటునెట్టితే అటు ఎగిరి, ఏగాలి విసురుకో కొండెక్కిపోతాము. మాలాంటి దీనులకి ఆ సర్వేశ్వరుడొక్కడే దిక్కమ్మా! కడుపు తడుముకుంటూ వచ్చాము. ఒకనాడు నాలుగు వేళ్ళూ నోట్లోకి వెళ్లినాయి ఇవ్వాళ్ళనూ. విధి వక్రించింది. పరువుకోసం దేవుళ్ళాడే మాకు అదే కరువయింది. తిండికీ ఇబ్బందవుతోంది మరిక్కడ ఏం చూసుకుని నిలవాలి తల్లీ''

అమావాస్య చీకట్లు అలుముకుంటున్నాయి. శూన్యమయిపోయిన వరలక్ష్మి భవిష్యత్తులా ఆ అంధకారం భయంకరంగా వున్నది.

లాంతరు వెలిగించి నమస్కరిస్తోంది వరలక్ష్మి.

మెరుపు మెరిసి మాయమయినట్టుగా కళ్లముందే భావిజీవితం మంటగలిసిపోయినా ఇంకా భగవంతుడిమీద విశ్వాసం

# వాళ్లు - వీళ్లు

విన్నారా—యీ కథను
చూచారా యీ చోద్యం
కెమెరాల కొక క్లబ్బట!
ఫోటోల కొక పోటీల పందెమట
గెలిస్తే బహుమానమట!
ఓడితే ఒక కర చాలనమట!
గెలుపు—ఓటమి కాదు ప్రధానం
పోటీలో పాల్గొనుటే అందరూసమానం
ఫోటోలు తీయడం ఒక అలవాటు
పోటీలు నడపడం ఒక వినోదం.
వేసారి క్లబ్బు సభ్యులు
ఒక వినోద ఫోటోలయాత్ర
నీలిరంగు సముద్రపు టొడ్డుకు
చూచారక్కడ వెన్నవాళ్ళు వీళ్లను
అనుకొన్నారిలా—
ఎవరీ పిచ్చివాళ్లు?
ఎందుకీ వింత ప్రయాణం?
నగరంలో పనిలేని వాళ్లా?
విరగం ఎందుకో సరదా యీ నీళ్లల్లో
ఫోటోలు తీస్తే పొట్ట గడుస్తుందా?
తిని కూర్చోలేక ఏమిటీ తిప్పలు?
తిన్నది అరగడానికి తిరగాలేమో!
మరిలేకుంటే ఏమిటీపాట్లు?
ఎగిరే పిట్టలను
మేసే పశువులను
పాడే పడతులను
పనిచేసే పల్లెవాళ్లను
చేపలు పట్టే గోచిరాయళ్లను
వీళ్లనా! వీళ్లు తీసేది ఫోటోలు?!
భలే! ఎంచక్కని పిచ్చివాళ్లు!!
వాళ్లలా అనుకోవడం న్యాయమే—
వీళ్లకు తీరిక సమయాల్లో ఏమి
చేయాలో తోచదు.
వాళ్లకు తీరికంటే ఏమో తెలియదు!
వీళ్లకు వాళ్లంటే అదొకరోత
వాళ్లకు వీళ్లంటే అదొక వింత
వీళ్లకు మురికి కాలవలే సెలయేళ్ళు
వాళ్లకు సెలయేళ్లే మురికి కాలువలు!
వీళ్లు కేమెరా లెన్సు ఎత్తారు
వాళ్లు నావ తెరచాప ఎత్తారు
వీళ్లు నదిలో నీళ్లను ఆనందిస్తారు
వాళ్లు అందున్న చేపలను అందు
కుంటారు.
వీళ్లు తీస్తారు ప్రాణంలేని బొమ్మలను!
వాళ్లు తీస్తారు ప్రాణాలు బొమ్మెడాల
చేపలకు
వీళ్లకు తీరేది క్రీడాతృష్ణ
వాళ్లకు తీరేది ఆకలిమంట!
వాళ్లు యిలా భావిస్తుంటే—
వీళ్ల కేమెరాలు—
తీస్తున్నాయి ఫోటోలు
రక రకాల జీవితాలనమూనాలు
కేమెరాకు వాళ్ళు వీళ్లు ఏమిటి?
అంతా క్లబ్బు వాళ్ల వినోదంకొఅకే
కేమెరాలకు మాత్రం చచ్చేపంతపని—
ఇదంతా కలసి సాగేదే ఫోటోల వినోద
యాత్ర.

[కాకినాడ కేమెరా క్లబ్బువారు సేక్రె మెంటో లైట్‌హౌస్‌కు ఫోటోల వినోద యాత్ర (ఫోటోగ్రాఫిక్ సఫారీ) వెళ్లిన సందర్భంలో వ్రాసినది.]

—ఎల్. మాలకొండయ్య



'కొంగ'. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఫొటోగ్రాఫిక్ సొసైటీవారు నిర్వహించిన అఖిలభారత ఛాయాచిత్ర ప్రదర్శనలో శ్రీ ఎల్. మాలకొండయ్యగారు తీసిన ఈ చిత్రానికి మొదటి బహుమతి వచ్చింది.

కోల్పోని వరలక్ష్మి మనస్థైర్యానికి మెచ్చుకుంటూ లేచి నిలబడ్డాను.

చివరిసారిగా సెలవు తీసుకుని వెనుతిరిగాను. గడప దాటుతూంటే, వరలక్ష్మి చెయ్యి నా భుజంమీద పడింది. తల తిప్పిచూశాను. ఆవేదన మూటగట్టుకున్న కళ్లతో చూస్తోంది వరలక్ష్మి 'చెప్పు సుజాతా! నాలో నీకు ఏదోషమన్నా కనిపిస్తోందా?' అమాయకంగా అడుగుతోంది వరలక్ష్మి.

క్షణం శ్రావణ మేఘాల్లావున్న నా స్నేహితురాలి కళ్లలోకి జాలిగా చూశాను. మంచు బిందువులాటి ఆమె చరిత్రలో ఏకళంకాన్ని వెతకను?

మౌనంగా వరలక్ష్మి కళ్లనీళ్లు తుడిచి నా కన్నీరు దాచుకునే ప్రయత్నంలో, గిరుక్కున వెనక్కితిరిగి గబగబ అడుగులు ముందుకువేశాను. (అయిపోయింది)